# అవధాన పుష్కరిణి

అంతర్జాల మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 7

పరాభవ - చైత్ర శుద్ధ విదియ, 20 మార్చి 2026




## అవధాన శిరోమణి కాశీ కృష్ణాచార్యులు

(1872 - 1967)

ఉ॥ ఆ రఘురాము భార్యను దశాననుఁడుంచిన కాననంబునన్
బారుగ నింగి నంటి కడువైభవమొప్పెడు వృక్షజాలముల్
సారముచచ్చి నేలఁబడి సాఁగిలిమ్రొక్కెనొ నాఁగడుల్లె నా
మారుతజృంభణంబెసఁగ మాసెఁ జలత్వము వృక్షకోటికిన్


ప్రచురణ

# అవధాన విద్యా వికాస పరిషత్

భాగ్యనగరం

అవధాన విద్యా విజయతే తరామ్




కాకతీయ విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాల సందర్భంగా

2026 ఫిబ్రవరి 22, 23, 24 తేదీలలో యూనివర్సిటీ సెనేట్ హాల్ లో జరిగిన

'అవధాన ప్రియ' చేపూరి శ్రీరామ్ గారి శతావధానం




శతావధాన విజయోత్సవ సభలో ప్రసంగిస్తున్న

కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీ పతాపరెడ్డి గారు

# అవధాన పుష్కరిణి

సంపుటి - 1 | అంతర్జాల మాస పత్రిక | సంచిక - 7

పరాభవ - చైత్రం 2026 | 20-03-2026 | ప్రచురణ: అవధాన విద్యా వికాస పరిషత్


శ్రీయుతమై రసైకలహరీసితమై, వివిధావధాన వి
ద్యాయతధీకవీశ్వరులు తామరలై విరియన్ - తదీయ వి
జ్ఞేయ సుపద్యమాధురు లశేషబుధాళుల కిందు విందుగా
నీ యవధాన పుష్కరిణి - ఈప్సితమై వెలుగొందు నందమై

- డా. జి.యం.రామశర్మ, శతావధాని


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకులు**
మరుమాముల దత్తాత్రేయశర్మ

**సహసంపాదకులు**
కె.వి.ఎన్. ఆచార్య

**గౌరవ సలహాదారులు**
నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ
మరుమాముల వేంకటరమణశర్మ
కంది శంకరయ్య

**సంపాదకవర్గం**
డా॥ జి.యం.రామశర్మ
ఆముదాల మురళి
డా॥ సంగనభట్ల నరసయ్య
మారేపల్లి వేంకట పట్వర్ధన్
ఆచార్య ఫణీంద్ర
చిటితోటి విజయకుమార్
చింతా రామకృష్ణారావు

**రూపకల్పన:** పంతుల విట్టుబాబు
**అక్షరాలంకరణ:** విరివెంటి సాహితీసుధ



**కార్యాలయం**
శ్రీరామ సదనం, 29-1499/6/1,
వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నం.1,
నేరేడుమెట్టు, సికిందరాబాద్ - 500 056
ఫోన్: 9441039146



అవధాన విద్యా వికాస పరిషత్ సేవాకార్యక్రమాలకు ఆర్థికంగా సహకరించదలచిన సహృదయులు ఫోన్ పే ద్వారా స్పందించగలరు.


**అవధానవిద్యా విజయతే తరామ్** | **సంపాదకీయం**

## ధారణాశక్తికి మతిమరుపే మందు

అవధానానికి ఆవశ్యక కీలక శక్తి ధారణ. **'ధారణలేని యవధానము వృధారణ'**మన్నారు పెద్దలు. ప్రతివ్యక్తి జీవితంలో కోట్లాది స్మృతులుంటాయి. అంతకు తగ్గని విస్మృతులూ ఉంటాయి. బిలియన్ల కొద్ది న్యూరాన్లు ప్రతినిత్యం మనిషి మెదడును ప్రభావితం చేస్తూనే ఉంటాయి. కొన్ని కణాలు వాటంతటఅవే చస్తూపుడుతూ నవనవోన్మేషంగా మేధా వికసనానికి కారణభూత మౌతుంటాయి. మెదడులో వాడని కనెక్షన్లను తొలగించే ప్రక్రియను 'సినాప్టిక్ ప్రూనింగ్' (*synaptic pruning*) అంటారు. (ఇది కలుపు తీయడం లాంటిది), నరాల వ్యవస్థలో చుట్టూఉన్న ధ్వనులను మెదడులోకి రాకుండా శబ్ద నియంత్రణ (*noice filtering*) కూడా న్యూరాన్లే అడ్డుకుంటాయి. చెల్లాచెదురుగా చెలరేగే భావాలను కుదురుగా కూర్చుకుని నిలుపగల ప్రజ్ఞావిశేషమే ప్రతిభ. ఒకేసారి అనేక పనులను నియంత్రించగలగడమే అవధానత.ఐతే నిత్యచైతన్యానికి జ్ఞాపకాలు ఎంత అవసరమో మరుపు కూడా అంతే అవసరమన్నది శాస్త్రజ్ఞులు తేల్చిన విషయం.

అవధానికూడా సాధారణమైన మనిషే అయినప్పటికీ **అసాధారణ ధారణాధురీణు**డెలా అవుతాడన్నది అందరిలో మెదిలే గొప్ప ప్రశ్న. దానికి సమాధానమే విస్మృతి. విచక్షణతో స్వీకరించవలసిన అంశాలు మాత్రమే స్వీకరిస్తూ అనవసరమైన వాటిపై దృష్టి పెట్టకపోవడమే ప్రజ్ఞ. దీన్ని ఉచితజ్ఞత అనుకోవచ్చు. వంటింట్లో గృహిణి కూరచేస్తున్నప్పుడు ఉప్పువేసే విధానమిదే.

ఇరవైతొమ్మిది రోజులలో వేయి పడగల నవలను డిక్టేట్ చేసిన కవిసమ్రాట్ ధీశక్తి ఇదే. 750 పద్యాలను ఏకబిగిన ధారణచేసిన ధారణా బ్రహ్మరాక్షసుని విద్వత్త ఇదే.

శిలను శిల్పంగా మార్చే శిల్పి ప్రయత్నపూర్వకంగా శిలలో అవసరం లేని భాగాలను తొలగిస్తాడు. శిల్పానికి అవసరమైన దాన్ని మాత్రమే మిగిలేలా చేస్తాడు. అవధానంలోనూ అంతే. ధారణేతరాంశాను చెప్పి వదిలేసి అవధాని ధారణాంశాలను పదిలపరచుకోవడానికి గట్టి సాధనచేయాలి. అప్పుడే ధారణ నిలుస్తుంది. స్వతస్సిద్ధంగా ఉన్న శక్తిని ప్రచోదింపజేస్తే అద్భుతాలు ఆవిష్కృత మౌతాయి. అవధాన సమరంలో అవధాని పైకి ఎంతప్రశాంతంగా ఉన్నట్లు కనిపించినా ప్రష్టల ప్రశ్నలతో అంతర్మథనం జరుగుతూనే ఉంటుంది. దాన్ని ఎదుర్కొనే అప్రమత్తత అవసరం.

(మిగతా 2వ పేజీలో)

# సంస్తుతి



## సీతాకృతి

**ఆకృతి రామచంద్రవిరహాకృతి, కన్బొమ తీరు స్వామి చా
పాకృతి, కన్నులన్ ప్రభు కృపాకృతి, కైశికమందు రామ దే
హాకృతి, సర్వ దేహమునయందును రాఘవవంశమౌళి ధ
ర్మాకృతి కూరుచున్న విధమంతయు స్వామి ప్రతిజ్ఞమూర్తియై!**

– తొలి జ్ఞానపీఠ పురస్కృతులు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

అశోకవనంలో సీతాదేవి ఆకారం రామచంద్రుని విరహానికి రూపంలా ఉంది. కనుబొమలేమో రాముని విల్లులా ఉంటే కన్నులలో రాముని కరుణ ఆకృతి దాల్చింది. ఆమె జడ రాముని శరీరకాంతితో మెఱుస్తుండగా, శరీరమంతా రఘువంశ చంద్రుడైన రాముని ధర్మం రూపుకట్టినట్టుంది. ఆ కూర్చున్న విధానం రాముని ప్రతిజ్ఞ మూర్తీభవించినట్టుగా ఉంది. ఎంతో ఉదాత్తమైన ఊహ కదా విశ్వనాథవారిది! ఎడబాటులో కూడా ఎప్పుడూ సీతారాములు కలిసే ఉంటారనే ఆలోచనే గొప్పది. కనుబొమలని ధనుస్సుతో అందరూ పోలుస్తారు, కురుల సౌందర్యాన్ని వర్ణించడానికి నల్లని నిగనిగలుగా చెప్పడమూ మామూలే. కాని వాటిని సీతమ్మ విషయంలో రాముని విల్లుగానూ, రాముని శరీరకాంతిగానూ అభివర్ణించడం అనన్యసామాన్యం. బాహ్యరూపంతో మొదలుపెట్టి, చివరికి ఆమె శరీరమంతా రాముని ధర్మానికి ప్రతిరూపంలా ఉందనడం, ఆమె కూర్చున్న తీరులో రాముని ప్రతిజ్ఞ కనిపిస్తోందనడం సాధారణ కవుల ఊహకు అందని విషయం. ఇది సీతారాముల అద్వైత ప్రణయాన్ని నిరూపిస్తుంది. 'రామాయణకల్పవృక్షం' లో ఇదొక ఉదాత్తమైన కల్పన.

(1వ పేజీ తరువాయి) **సంపాదకీయం**

అందుకు సహాయ పడేది అనవసరవిషయాలను వడపోసే విజ్ఞత. వేదికపై పొగడ్తలను, అతిథుల ప్రసంగాలను, ప్రయాణపు బడలికలను, ఇంట్లో – ఒంట్లో అస్వస్థలను అధిగమించాలంటే విస్మృతే గొప్ప ఔషధం.

ధ్యానం, యోగం, సరైన నిద్ర, సరైన పోషకాలు లభించే మంచి ఆహారం, తగినవిధంగా మంచినీళ్లు తాగడం వంటివెన్నో ధారణాశక్తికి కారణాలౌతాయి. ధారణాశక్తికి ఏ మందులు ఉండవు. ప్రాణాయామం, ప్రత్యాహారం (ఇంద్రియ ఉపసంహారణ) మరియు ధ్యానం వంటి పద్ధతుల ద్వారా మాత్రమే ధారణను మెరుగుపరచుకోవచ్చు .

## ఇదీ క్రమణిక


1. కావ్యాస్వాదన … … … … … … … … 3
2. అవధానకళాచరిత్ర … … … … … … . 4
3. సత్కకవి ప్రతిభకు తార్కాణం సమస్యాపూరణం.. 6
4. పద్యపరీమళం … … … … … … . 7,12
5. విశిష్ట తెలుగు భాషా వైభవం… … … … .. 8
6. నిఘంటుపరిజ్ఞానం… … … … … … … 9
7. అవధానవేదిక … … … … … … … … 10
8. గర్భకవిత్వం… … … … … … … … . 11
9. పూరణతోరణం … … … … … … . 13
10. ఛందస్సౌందర్యం … … … … … … … 15
11. వ్యాకరణ వరివస్య … … … … … … .. 16
12. కావ్యశాస్త్రగవేషణ … … … … … … … 18
14. ఖండశర్కర … … … … … … … … . 22
15. సంస్కృత సంస్కృతి … … … … … … 24




## సహృద్వాణి

ఫిబ్రవరి నెల సంపాదకీయం చాలా యోగ్యంగా ఉంది.

**– డా.ధూళిపాళ మహాదేవ మణీ**

పత్రిక తెలుగు భాషాయోషకు కట్టిన పట్టుపుట్టము వలెనున్నది. అవధాన ప్రక్రియను చేపట్టు వారికే గాక రసిక జన శ్రోత్రుగణములు అవధాన సారస్యము గ్రహించుటకు అనేక ఛందోవ్యాకరణాంశముల ప్రస్తావన పొందుపరచటం ఉపయుక్తమగును . చదువది ఎంత గల్గిన రసజ్ఞత యించుక చాలకున్న....అన్నట్టు ఇందులో రసజ్ఞతను అలవర్చే అనేక అంశములున్నవి . అభినందనలు .

**– శ్రీ తుమ్మూరి రామ్మోహన్ రావు**

ఇయ్యవధానపుష్కరిణినెవ్వరు యోచనచేసి తీర్చిరో
తియ్యనినామధేయమది ధీనిడియెవ్వరుపెట్టిరో బృహద్
ధ్యేయము భారతీనుతము తెన్గుతరాలను పద్యవిద్యల
న్నుయ్యెలవోలెనూచి మధురోహలఁదేల్చిప్రశస్తికెక్కెడిన్

**– చక్రాల లక్ష్మీకాంత రాజారావు**

నెమ్మినవధాన పుష్కరణి రసగంగ
యందు మజ్జనమొనరించునట్టి భాగ్య
మబ్బె మాభోంట్లకంజలులందజేతు
భవ్యమౌమరుమాముల వంశతిలక! **– మంకుశ్రీను**

# యయాతి చరిత్ర

## డా. ఆచార్య ఫణీంద్ర

తన వాలు ముక్కంటికిని మార్తురగు రాచ
  గములెల్ల బూవిలుకాండ్రు కాగ -
తన రూపు వలకు బైదలుల నెమ్మదు లెల్ల
  మేలైన బేడిస మీలు గాగ -
తన యీగి తొగరేనికిని వేడు వారెల్ల
  దులకించు కల్వల తుటుము గాగ -
తన గెల్పు పట్ల వ్రాతలకు మున్నీటి య
  వ్వల నున్న సుడిగట్టు పలక కాగ -
తనదు తేజు జగం బనతగిన తమ్మి
కొలకునకు గోర్కులిడు వేడివెలుగు కాగ -
కడలి లోగొన గల్గిన పుడమి యెల్ల
నానకును లోనుగా నేలె నయ్యయాతి!




"పొన్నికంటి తెలగన" కవి రచించిన "యయాతి చరిత్ర" అనే అచ్చ తెనుగు కబ్బంలోని ప్రథమాశ్వాసంలో - 92వ పద్యం ఇది. దీనికి ముందు 91వ పద్యంలో ఈ కావ్య కథానాయకుడైన యయాతి మహారాజును పరిచయం చేసాడు తెలగన కవి. ఈ పద్యంలో కథానాయకుడు యయాతి భూపతి శౌర్య పరాక్రమాలను, వ్యక్తిత్వ సౌందర్యాలను సముచితమైన ఉపమానాలతో పోలుస్తూ మనోజ్ఞంగా వర్ణించాడు. ఈ సీస పద్యంలో కూడ కవి పొన్నికంటి తెలగన ఒక్కొక్క పాదాన్ని ఒక్కొక్క అంశంతో హృదయంగమంగా నడిపిన తీరు విశేషంగా ఆకట్టుకొంటుంది.

ఇక పొన్నికంటి తెలగన కవిచే ఈ పద్యంలో ప్రయోగించబడి, ఈ తరం తెలుగు పాఠకులకు నిత్య వ్యవహారంలో తారసపడని అచ్చ తెనుగు పదాలను పరిశీలిద్దాం. అవి... వాలు (కత్తి); మార్తురు ("మార్తుడు" కు బహువచనం - శత్రువులు); రాచగములు (రాజవంశీయుల సమూహాలు); పూవిలుకాండ్రు (పూల విల్లులను ధరించిన వారు .. అనగా మన్మథులు); పైదలులు ("పైదలి" యొక్క బహువచనం .. అనగా స్త్రీలు); బేడిస (ఒక మేలైన మత్స్యజాతి); మీలు ("మీను" కు బహువచనం .. అనగా చేపలు); ఈగి (దానగుణము); తొగరేడు (కలువలరాయడు .. అనగా చంద్రుడు); తులకించు (పులకించు లేక ఆనందించు); తుటుము (గుంపు లేక సమూహము); తన గెల్పు పట్ల వ్రాతలకు (రాజులు ఆనాడు తమ విజయాలకు సంబంధించిన వ్రాతలను శిలా శాసనాలపై చెక్కించేవారు .. కాబట్టి, ఈ మొత్తం అచ్చ తెనుగు పదాల గుంపుకు "శాసనాలకు" అని అర్థం చెప్పుకోవలసి ఉంటుంది); సుడిగట్టు (ఇంతకు ముందు కొన్ని పద్యాలలో కూడ కృతికర్త ఈ పద ప్రయోగం చేసాడు. దాని అర్థం - భూమిని చుట్టుకొని యుండు కొండ.. అని చెప్పుకొన్నాం); తేజు (ఇది కూడ ఇంతకు ముందు చెప్పుకొన్నదే.. తేజస్సు అని దీని అర్థం); తమ్మి కొలకు (తామరల కొలను); వేడి వెలుగు (సూర్యుడు); లోగొన గల్గిన (నడుమ గల).

ఇక ఈ అచ్చ తెనుగు పదాల అర్థాలు పూర్తిగా ఆకళించుకొన్నాక, ఇప్పుడు ఈ పద్య సారాంశాన్ని అవగతం చేసుకొందాం. తన కత్తి అనే పరమశివుని మూడవ కంటి ముందు శత్రువులైన రాజుల సమూహాలన్నీ మన్మథులు కాగా .. అనగా మాడి మసియై పోగా; తన రూపం లేదా సౌందర్యం అనే వలకు పడతుల నెమ్మదులు అనగా వారి కుదురుగా ఉన్న మనస్సులు కూడ .. మేలు జాతి చేపలై చిక్కుకొనగా; తన దానగుణం అనే చంద్రుని అర్థించే వారందరూ కలువపూల గుంపులా పులకించి పోగా; తన విజయ శాసనాలను చెక్కించేందుకు - సముద్రానికి ఆవల .. భూగోళం చుట్టూరా ఉన్న చక్రవాళ పర్వతమే శిలాఫలకంగా ఉండగా; తన తేజస్సు ఈ జగత్తు అనదగిన తామర కొలనుకు కోరికలు తీర్చే సూర్యుడు కాగా; సముద్రం (ఇక్కడ సముద్రం అంటే కేవలం ఒక సముద్రం అని కాకుండా, మన పురాణాలలో వివరించినట్టుగా "చతుస్సాగర పర్యంతం" అన్న మాట) నడుమ గల భూగోళమంతా తన ఆజ్ఞకు లోబడి ఉండగా, ఆ యయాతి ప్రభువు పరిపాలించాడు .. అని ఈ పద్యం మనకు వివరిస్తుంది. మొత్తానికి కవి ఈ సీసపద్యంలో - మొదటి పాదంలో .. యయాతి భూపతి శౌర్యాన్ని; రెండవ పాదంలో .. సౌందర్యాన్ని; మూడవ పాదంలో .. దాన గుణాన్ని; నాల్గవ పాదంలో యుద్ధ నైపుణ్యాన్ని; ఆ పై ఎత్తుగీతిలో .. తేజస్సును, పాలనా దక్షతను వర్ణించిన తీరు అనన్యసామాన్యం. ఆంగ్లంలో 'సూపర్లేటివ్ డిగ్రీ' అని వ్యవహరిస్తూ ఉంటారు. ఒక మహారాజు ఔన్నత్యాన్ని ఇంత కన్న ఉత్కృష్టంగా వర్ణించడం మరే కవికైనా సాధ్యమా?

అట్లాగే .."ఉపమా కాళిదాసస్య" అని సంస్కృత సాహిత్యంలో మహాకవి కాళిదాసు యొక్క ఉపమాలంకార ప్రయోగ నైపుణ్యాన్ని కొనియాడుతూ ప్రసిద్ధమైన లోకోక్తి ఉంది. మరి తెలుగు భాషలో .. అందునా ఇటువంటి అచ్చ తెనుగు కబ్బంలో ఇంత అద్భుతంగా ఉపమానాలను ప్రయోగించిన మరో కవిని ఎవరినైనా ఊహించ గలమా? అందుకే ..

అచ్చ తెనుగు కబ్బాల నల్లిన కైతగాళ్ళు నిలిచిన నింగిలో - పొన్నికంటి తెలగన ఇప్పటికీ "పొద్దు గూకని వేడివెలుగు" గా వెలుగులీనుతూనే ఉన్నాడు.

# తిరుపతి వేంకటకవులు

అవధానకళా చరిత్ర
7
శతావధాని
ఆముదాల మురళి

ప్రకటతర కప్పగంతుల
సుకులోదధి పూర్ణచంద్ర! సూరిజనేంద్రా!
సుకరముగ మక్షికాశా
బకమున్ వడి మ్రింగుచున్న బల్లింగనుమా!

బకము సుకరంగా మక్షికాశాబకముగా మారిపోయింది. ఈగను బల్లి తినడంలో సమస్య లేదుగదా! విశాఖపట్టణంలో చేసిన అవధానంలో 'పాదమ్ములు లేని తరులు పరుగిడజొచ్చెన్" అని ఇచ్చిన సమస్యను స్వీకరించిన తిరుపతి వేంకటకవులు చెట్లనెలా పరుగెత్తించారో చూడండి.

ఏదెస వానలు గురియన్
గోదావరి పొంగివచ్చె గుములుగ నందున్
వేదొరలి నీట దృఢతర
పాదమ్ములు లేని తరులు పరుగిడ జొచ్చెన్

అదే అవధానంలో ఇద్దరు స్త్రీలకు సంతానం కలిగే సమస్యను పరిష్కరించిన తీరుచూడండి.

అతికుతుకం బలరారగ
జతురత మెఱయంగ మదన శాస్త్ర విధమునన్
వితతంబగు తన సౌధవ
సతి సతి గవియంగ బుత్రసంతతి గలిగెన్

వీరు సమస్యలను అర్ధాంతరన్యాస అలంకారంగా మార్చి పూరించినవి చాలా ఉన్నాయి. మచ్చుకొక సమస్య బెజవాడ శతావధానం నుండి చూడండి.

"మందారము జూడనెంతురె ఘనంబగు నట్టి గులాబి ముందరన్" – ముందు ఒక గురువు అదనంగా ఉన్న ఉత్పలమాలా వృత్తమిది. మొదట దాన్ని గ్రహించి రేఫప్రాసతో ఉత్పలమాల ప్రారంభించాలి. ఇదే ఇందులో ప్రధానమైన సమస్య. దాన్ని ఆలంకారింకంగా పూరించిన పద్యం ఇది.

ధీరత గల్గి చక్కనగు తెల్వియు దేటయు బొల్చి మేల్మి బం
గారము రీతిగా గవిత కల్పన చేసెడి వారలుండ శు
ష్కోరుతరోక్తులన్ గొనగ నొప్పుదురే సుకవీంద్రులెందు మం
దారము జూడనెంతురె ఘనంబగునట్టి గులాబి ముందరన్.

తిరుపతి కవులు సంస్కృత సమస్యలను కూడా పూరించారు. బందరు శతావధానంలో 'మధ్యాహ్నే శశి మండలం కబళితం క్రూరాత్మనా రాహుణా' అని సమస్య నిచ్చారు. ఈ సమస్యను అభిమన్యయుద్ధ కథకు అనుసంధానం చేసిన తీరు చూడండి.

పద్మవ్యూహముపాగతే గురువరే తస్మిన్ప్రవిష్టం రయా
చ్చూరం పార్థసుతం జఘాన గదయా దౌశ్శాసనిః క్రూరయా?
దృష్ట్వా తద్వదనం గదావికలితం ప్రోచుర్మిథో నిర్జలా
మధ్యాహ్నే శశిమండలం కబళితం క్రూరాత్మనా రాహుణా ?

## వర్ణనలు

బెజవాడలో జరిగిన అవధానంలో 'రామకథ'ను వర్ణించిన తీరిది.

నీరేజాప్తకులమ్మునం బొడమి యెంతే యోగ్యయౌ జానకిన్
దారంగాగొని తండ్రియానతి నరణ్యానం బ్రవేశించి భూ
భారంబెల్లను మాన్ప రక్కసుల దర్పంబూడ్చి సాకేతమం
దే రాముండు సుఖమ్ములం గొనియె నే నీక్షింతు నద్దేవునిన్

సూర్యవంశంలో పుట్టి, యోగ్యురాలైన జానకిని భార్యగా చేపట్టి, తండ్రి ఆజ్ఞను తలదాల్చి అరణ్యవాసానికి వెళ్లి, భూభారం తగ్గించడానికి రాక్షసులను వధించి, అయోధ్యకు చేరుకొని పట్టాభిషిక్తుడైన శ్రీరాముని గొల్చెదనని భావం. రామకథను ఇంత సంగ్రహంగా చెప్పడం తిరుపతి కవుల వర్ణనా నిపుణతకు నిదర్శనం.

నర్సాపురం అవధానంలో 'జరావస్థ'ను వర్ణించిన పద్యం చూడండి.

చూచిన యంత మాత్రమున సుందరు లెల్ల హసింత్రు, పిల్లలున్
గోచిని బట్టి లాగుదురు కొందరు 'తాత' యటంచుఁ గేరి దో
బూచుల నాడ బూనుదురు పో! జర మూడిన మీద నక్కటా
యే చవి గానుపింపదు మఱెయ్యదియున్ సుఖమీయ దేరికిన్

ముసలితనం ముసిరినప్పుడు కలిగే బాధలను వర్ణించిన ఈ పద్యం స్వభావోక్తి భరితంగానున్నది.

శ్రీకాకుళం అవధానంలో పరమాత్మను వర్ణించిన పద్యం చూడండి.

సిరులిడు నే మహామహుని సేవన, మెవ్వరికేని సౌఖ్యముల్
పరగగజేయు నే మహితు పాదనమస్కృతి, జ్ఞానమిచ్చు నే
పరముని నామసంస్మరణ భద్రదమెవ్వని వృత్తి తాదృశున్
జిరతరు నాదిపూరుషు భజింతు, యజింతు, స్మరింతు సత్కృతుల్

అదేవిధంగా 'సత్యము'ను గూర్చి చెప్పిన పద్యం కూడా రమ్యతరమైనదే.

తపమొక దేల, పెక్కులగు దానములేల, యనేక తీర్థముల్
నెపమున బోయి గ్రుంకిడగనేల, యనేక పురాణజాలముల్
చపలత జూడనేల, బహుశాస్త్రములన్ బఠియింపనేల, స
త్యపు నెల గుర్తెఱింగిన మహాత్ముల కూరక యేల జన్నముల్

తిరుపతి కవుల వర్ణనలు ఆశువుగా చెప్పినా కావ్యస్థాయిలో ఉంటాయనడానికి ఈ పద్యాలు మచ్చుతునకలు

## ప్రాసంగిక పద్యాలు

తిరుపతి వేంకటకవులు నానారాజ సందర్శనం చేస్తూ ప్రసంగవశాత్తు రసగుళికల్లాంటి పద్యాలు చెప్పారు. వాటిలో మచ్చుకు కొన్ని చూద్దాం.

గద్వాల సంస్థానాన్ని దర్శించినప్పుడు రాజు ఎదుట తిరుపతి కవులు తమ కవిత్వశక్తిని గూర్చి ఇలా చెప్పారు.

సీ. శతఘంట కవనమ్ము సల్పు సంగతియన్న
గరతలామలకమ్ము గాదె మాకు
అష్టావధాన కష్టావలంబనమన్న
నంబికొండయ దండనంబు మాకు
ఆశుధారాకవిత్వాడంబరంబన్న
నల్లేరుపై బండి నడక మాకు
సత్కావ్య నిర్మాణ చాకచక్యంబన్న
షడ్రసోపేత భోజనము మాకు
తే.గీ. వ్యర్థమగు వాదము లొనర్చు నట్టివారి
దంబ మణగించు టాపోశనంబు మాకు
దానరాధేయ ! కవి సముదాయగేయ !
పండితవిధేయ ! రామభూపాలరాయ !

ఆత్మకూరు సంస్థానంలో మీసాలున్నందున వీరిని పండితులు కారని అధిక్షేపించగా చెప్పిన పద్యమిది.

దోసమటం చెఱింగియును దుందుడు కొప్పగ బెంచినార మీ
మీసము "రెండు భాషలకు మేమె కవీంద్రుల" మంచు దెల్పగా
రోసము గల్గినన్ గవివరుల్ మముగెల్వుడు గెల్చిరేని ఈ
మీసము దీసి మీ పద సమీపములన్ దలలుంచి మ్రొక్కమే

ఇది వారి ధిషణకు, సంస్కృతాంధ్ర భాషలయందు అధికారమునకు నిదర్శనం.

ఆత్మకూరు సంస్థానంలో సన్మానం జరిగినప్పుడు చెప్పిన పద్యాలలో ప్రసిద్ధి గాంచిన పద్యమిది.

ఏనుగు నెక్కినాము, ధరణీంద్రులు మ్రొక్కగ నిక్కినాము, స
న్మానము లందినాము బహుమానములన్ గ్రహియించి నారమె
వ్వానిని లెక్కపెట్ట కనివారణ దిగ్విజయంబొనర్చి ప్ర
జ్ఞానిధులంచు పేరుగొనినారము నీవలనన్ సరస్వతీ!

అదే సంస్థానంలో తిరుపతి కవుల రచనలో తప్పులు బట్టిన వారిపై చేసిన ప్రతిన ఇది.

అభినవ రామలింగ బిరుదాంకుడ నా కవనమ్ము నందు నీ
యభణపు గాండ్లు తప్పులిడ నర్హులె? 'కా' దని తప్పు దిద్ద మా
యుభయములో నొక్కడు మఱొక్కని కిందగు గాక యూర్వుచే
నభము శుభమ్మునం దెలియ కార్చెడి దేబెలు మాకు లెక్కయే

కొల్లూరు సంస్థానంలో సంస్కృతాంధ్రాల అధ్యయనం గురించి చెబుతూ ఇలా అన్నారు.

తెలుగు తెలుగని యద్దాన దిగుటెకాని
సంస్కృతమ్మున కన్న కష్టమ్ము హెచ్చు
ఒక్కదాన బరిశ్రమమున్న జాలు
దాని, కిద్దానికో రెంట దగుల వలయు

తెలుగు నేర్వడం సంస్కృతం కంటే కష్టం. ఎందుకంటే సంస్కృతం అంటే దాంట్లో మాత్రమే పరిశ్రమ చేస్తే చాలు. కాని తెలుగంటే సంస్కృతాంధ్రాల రెంటిలో పాండిత్యం సంపాదించాలని అభిప్రాయపడ్డారు.

అవధాన రంగంలో తిరుపతి వేంకటకవులను గూర్చి ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి. అవధానవికాసానికి తిరుపతి వేంకటకవులు ఎంతగా దోహదం చేశారో వేలూరి శివరామశాస్త్రి గారి క్రింది పద్యాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది.

ఎక్కడ జూచినన్ కవులె యెక్కడ జూడ శతావధానులే
యెక్కడ జూడ నాశుకవు లెక్కడ జూడ ప్రబంధకర్తలే
దిక్కరు లంచు బేర్వడిన తిర్పతి వేంకట సూరులేగు నా
ప్రక్కల నెల్ల నీ కడుపు పండినదమ్మ తెలుంగు దేశమా!

వారు తెలుగుపద్యాన్ని ఆబాలగోపాలానికి చేరువచేశారు. వారి నాటకాల్లోని బావా! యెప్పుడు వచ్చితీవు, అదిగో ద్వారక, ఎక్కడ నుండి రాక, చెల్లియొ చెల్లకో, అలుగుటయే యెరుంగని, సంతోషంబున సంధి చేయుదురే, జెండాపై కపిరాజు వంటి పద్యాలు జనబాహుళ్యం నోళ్ళలో నానుతూనే ఉన్నాయి. వారి ప్రబంధాలు రసగుళిక ల్లాంటి పద్యాలతో విరాజిల్లుతున్నాయి. విశ్వనాథ సత్యనారాయణ గారన్న "వానలో తడియని వారు మధ్దురు వధాన మృదూక్తి మరందధారలో కడుగనివారు మా కెచట కానగరారిల తెల్గునాడునన్" ఈ మాటలు తిరుపతి వేంకటకవులు అవధాన వికాసానికిచ్చిన తోడ్పాటును తెలియ జేస్తున్నాయి. తిరుపతి కవుల కాలాన్ని అవధానానికి స్వర్ణయుగంగా పేర్కొనవచ్చును.

**(సశేషం)**

**మనవి**

- పత్రికకు వ్యాసాలు, పద్యపూరణలు పంపేవారు యూనికోడ్ లో ఓపెన్ టెక్స్ట్ ఫైల్ రూపంలో మాత్రమే పంపండి.
- PDF , Photo copy రూపంలో పంపినవి స్వీకరించలేము.
- కవులు, రచయితలు తమ పేరు, ఊరు, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయండి.
- అవధాన విద్యా వికాస పరిషత్ సమూహంలో కానీ 9441039146 వాట్సాప్‌కు "అవధాన పుష్కరిణిలో ప్రచురణార్థం" అని వ్రాసి మీ రచనలు పంపవచ్చు.

**- సంపాదకులు**

# సత్కవి ప్రతిభకు తార్కాణం - సమస్యా పూరణం

– శతావధాని డా॥ జి.యం. రామశర్మ

తిరుపతి వేంకటకవుల సమకాలికులైన సుప్రసిద్ధ శతావధానులలో శ్రీ కాశీ కృష్ణాచార్యులు గారొకరు. కాశీ కృష్ణాచార్యులుగారు (1872 - 1967) సంస్కృతాంధ్ర భాషలలో మహాకవులే కాక గొప్ప తార్కికులు. వేణుగానం, వాయులీన, మృదంగ వాదనలు మొదలైన 16 కళలలో పరిణతి సాధించిన కళాప్రపూర్ణులు. సంస్కృత భాషా బోధనకు, ప్రచారానికి ఆజీవితం కటిబద్ధులైన ప్రజ్ఞావంతులు. వారు గుంటూరు ఉన్నత పాఠశాలలో సంస్కృత పండితునిగా ఉద్యోగించారు. ఆరు సంవత్సరాల పాటు (1961 నుండి 1967 వరకు) ఆం.ప్ర. ప్రభుత్వ ఆస్థాన కవి పదవిని అలంకరించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం వారిచే కళాప్రపూర్ణ బిరుదముచే సత్కృతులైన ధీశాలివారు. తన 19వ ఏటనే గుంటూరులో శతావధానం చేసి పండిత ప్రశస్తికి పాత్రులయినారు. సంస్కృతాంధ్ర భాషలలో వివిధ ప్రాంతాలలో అవధానాలు చేసి అవధాని శిరోమణి బిరుదాన్ని పొందారు. పలు సంస్థానాలలో ఆశుకవితా సభలను కూడా నిర్వహించారు. వారి అవధానాలలో అశ్వప్లుతి (చదరంగంలో గుఱ్ఱపు ఎత్తు మాత్రమే వేస్తూ అవధాని ఆడే విధానం. దీనకే తురంగోద్గమనం అని మరో పేరు) ఆశుకథాకథనం అనే రెండు వినూతనాంశాలు బందరులో చేసిన శతావధానం ఆచార్యుల వారికి గురుతర కీర్తిని సంతరింపజేసింది. ఆ శతావధానంలో ఒక ప్రాశ్నికుడు 'నీహారాద్రిని నిప్పుకొండ యని పాండిత్యమ్ము దీపింపగన్' అనే సమస్యనీయగా దానికి వారి సమయోచితమైన పురాణ ఇలా సాగింది.

శా॥ ఓహోహో యిది వెండి కొండయని నేనూహించిన్మున్నునే
దూహింప న్విలసన్నటేశ్వర నిటాలోద్భూత దూమావళీ
వ్యూహంబునని తర్కశాస్త్ర గతి నేనూహించి సాధించితిన్
నీహారాద్రిని నిప్పుకొండ యని పాండిత్యమ్ము దీపింగన్

**భావము:** ఈ మంచుకొండను పావనత్వాన్ని బట్టి తెల్లదనాన్ని బట్టి ముందు నేను వెండికొండ(కైలాసము) అని అనుకున్నాను. కాని ప్రస్తుత మూహించగా అక్కడ విలసిల్లే నటేశ్వరుడైన మహేశ్వరుని ఫాలభాగం (అగ్నినేత్రం) నుండి వెలువడిన పొగల సమూహాన్ని చూచి తర్కశాస్త్ర పద్ధతిలో ఊహించి ఆ పాండిత్యముతో ఈ మంచుకొండను నిప్పుకొండ అని తర్కించి (ఊహించి) సాధించాను.

ఈ పూరణ అర్థం పూర్తిగా తెలియాలంటే కొద్దిగా తర్కశాస్త్ర పరిచయం అవసరం. తర్కశాస్త్రంలో అనుమాన ప్రమాణానికి చాలా ప్రాధాన్యమున్నది. పూరణలో 'తర్కశాస్త్రగతి' అనే పదానికి తర్కములోని అనుమాన ప్రమాణం ద్వారా అని అర్థం. 'లింగ పరామర్శః అనుమానమ్' అని అనుమాన ప్రమాణం యొక్క లక్షణం. లింగమంటే వ్యాప్తి (నియతంగా కలిసి ఉండడం) బలంతో పదార్థాన్ని తెలియపరచేది. పొగ అగ్నికి లింగము (గుర్తు లేద హేతువు) అదెట్లనగా "యత్ర ధూమస్తత్రాగ్నిః" (ఎక్కడ పొగ ఉంటుందో అక్కడ అగ్ని ఉంటుంది) అనే నియత సాహచర్యానికి వ్యాప్తి అని పేరు. ఈ వ్యాప్తి బలంతో అగ్ని యొక్క జ్ఞానాన్ని కలిగిస్తున్న పొగ అగ్నికి లింగము (గుర్తు). ఈ లింగ పరామర్శయే అనుమానము.

'సాధ్య నిర్దేశః ప్రతిజ్ఞా' అనే లక్షణాన్ని బట్టి సాధించవలసిన దానిని (సాధ్యమును) నిర్దేశించడాన్ని (చెప్పడాన్ని) ప్రతిజ్ఞా అంటారు. 'పర్వతో వహ్నిమాన్' (కొండ అగ్ని కలది) అనేది ప్రతిజ్ఞా వాక్యము. వ్యాప్తి బలముతో దీన్ని నిరూపించాలి. పై వాక్యములో కొండ పక్షము, అగ్ని సాధ్యము (సాధించవలసినది), ధూమవత్వాత్ (పొగ కలిగినది అగుటచేత) అనేది హేతువు. ప్రకృతంలో శ్రీకృష్ణాచార్యులవారి సమస్యాపూరణాన్ని పరిశీలించినట్లయితే – మంచుకొండ పక్షము, నిప్పుకొండ సాధ్యము (సాధించవలసినది), పొగల సమూహము హేతువు. వెరసి ఆ మంచుకొండపై విలసిల్లే నటేశ్వరుని కంటిమంట నుండి వెలువడిన పొగల గములనే హేతువు (గుర్తు) చేత ఆ మంచుకొండ నిప్పుకొండగా కవిచేత సాధించబడినది.

ఈ పూరణలో మరొక విశేషం – విలసన్నటేశ్వర నిటాలోద్భూత దూమావళీ వ్యూహంబున్ – అనే సమీచీనమైన సమాసం. నిటల శబ్దానికి 'నిటాల' అనే రూపాంతరం కూడా కలదు. ఇది అవధాని యొక్క పదసంపదను సూచిస్తున్నది.

# పద్యపరిమళం

## చతుర సంభాషణము

- అన్నమరాజు ప్రభాకరరావు

పాండవ వంశములో జనమేజయుడు సాత్త్వికుడు, జనహితుడు, క్షత్రియోచితముగా రాజ్యపాలనము చేయుచున్నవాడు. ఈతని తండ్రి అభిమన్యు పుత్రుడైన పరీక్షిత్తు వేటకు వెళ్లి అక్కడ కొన్ని పరిస్థితులలో తపోనిష్ఠలో నున్న శమీక మహర్షి మెడలో నొక మృత సర్పమును వైచినాడు. ఆ ముని కుమారుడైన శృంగి శాప ఫలముగా నాటికి యేడవ నాడు తక్షక దష్టుడై మరణించినాడు. ధర్మపరుడును వివేకియునైనఁ జనమేజయుడు - అరణ్యవాసులైన మునుల రక్షణ బాధ్యత కలిగిన రాజే తపోనిష్ఠలో నున్నమునిని అవమానించుట - తన తండ్రి తప్పిదంగా నెఱింగి మిన్నకున్నాడు.

ఇట్లుండ, పూర్వము తక్షక వంచితుడైన ఉదంకుడను మహా తపస్వి తక్షకుని యెడ తనకు గల ప్రతీకారమును, తాను బ్రాహ్మణుడు గనుకను, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ క్షత్రియ ధర్మములు గనుకను, ప్రస్తుతము తక్షకునిచే పితృహీనుడైన జనమేజయుని ద్వారా తీర్చనెంచి, జనమేజయుని యాస్థానము చేరినాడు.

ఇప్పట్టున మహాకవియైన నన్నయ యొక్క చతుర సంభాషణా నిర్మాణ కౌశలమును గమనింతము. ఇచట దోషము తండ్రిదే యని నమ్మిన జనహితుడైన జనమేజయుని యంతరంగమున ప్రతీకారేచ్ఛ రగుల్చవలెను. ఉదంకుడు జనమేజయుని సర్ప యాగమున కొప్పించుట కేమి చేసినాడు ? అట్టి సర్పయాగమును అసంపూర్ణముగా నుడిగింపజేసి తన జాతిని రక్షించుకొనుటకు ఆస్తీకుడు జనమేజయుని సంకల్పము నెట్లు మార్చినాడు? నన్నయ మాటలలోననే. . . . . . . .

ఉదంకుడు జనమేజయునితో ......

చం. మితహిత సత్యవాక్య! జనమేజయ! భూజనవంద్య! యేను సు
స్థితి గురు దేవకార్యములు సేయగబూను టెఱింగి వంచనో
న్నతమతియై యకారణమ నా కపకారము సేసె దక్షకుం
డతి కుటిలస్వభావుడు పరాత్మవిశేషవివేకశూన్యుడై

(ఆది 1-121)

జనమేజయుడు రాజు. సభలోనున్నాడు. కనుక యెక్కువ విషయమును తక్కువ మాటలలో చెప్పవలె. చెప్పినాడు. సాధారణముగా వివేకవంతుడైన రాజు సభలో వ్యతిరేక వాదమునకు దిగడు. కానీ ఆయన కేర్పడవలసిన భావము లాయన కేర్పడుచుండును. ఈ విషయము నెఱింగినవా డుదంకుడు. ముందుగనే రాజు తనమాట వినునట్లు చేసికొనుచున్నాడు. "మితహిత సత్యవాక్య" అనినాడు. నీవు మితభాషివి హితభాషివి సత్యభాషివి. పరులకు మేలు కూర్చు మాటలు మితముగా పలికెదవు. నేను చెప్పునది సావధానముగా విని యెదురాడక చేయువాడవు. ఆడినమాట తప్పనివాడవు అనునది ధ్వని. "భూజనవంద్య" అనినాడు. నీ ప్రవర్తనమును, ఆశ్రితజనాభీష్టములు తీర్చు నీ బుద్ధిని, నీ సత్పరిపాలనమును గాంచిన పుడమిజనులు నిన్ను కీర్తించుచున్నారనినాడు.. ఇట్టి పొగడ్తలు రాజులకు సహజమే. తక్షకుడు తన కపకారము చేసినాడనినాడు. అపకార మెందులకు చేసెను ? అకారణముగ. నిష్కారణముగా నపకార మొనర్తురా? వంచనోన్నతమతి గనుకను, అతి కుటిలస్వభావి గనుకను, పరాత్మవిశేషవివేక శూన్యుడు గనుకను వీడు చేయును. అయినను జనమేజయునకు కోపము రాలేదు.

ఉదంకు డొక్కొక మాట యనుచు జనమేజయుని ముఖమును పరిశీలించుచున్నాడు. తానాశించిన మార్పు రాలేదు. ఉదంకు డాగలేదు.

చం. అనవరతార్థదానయజనాభిరతున్, భరతాన్వయాభివ
ర్ధను, సకలప్రజాహితవిధాను, ధనంజయసన్నిభున్, భవ
జ్జనకు బరీక్షితున్ భుజగజాల్ము డసహ్యవిషోగ్రధూమకే
తనహతి జేసి చేసె నతిదాంతు గృతాంతనికేతనాతిథిన్

(ఆది 1- 123)

మరల - తక్షకుడు కేవలము నాకు మాత్రమే కాదు. నీ తండ్రియైన పరీక్షిత్తును చంపి నీకు కూడా అపకారమొనర్చినాడు. నీ తండ్రి యెట్టివాడు అనవరత దాన యజన శీలుడు, భరతవంశోద్ధారకుడు, సకల జనహిత విధానుడు, ధనంజయ సన్నిభుడని పరీక్షిత్తును అర్జునునితో సమానునిగా చేసినాడు. ఇట్లు చేయుటలో ముత్తాతను స్ఫురణకు తెచ్చి అతనిలోని ఆత్మీయతను రెండింతలు చేసినాడు. నీ తండ్రి "అతి దాంతుడు". ఆతడో "భుజగజాల్ముడు". ఎట్లు చంపినాడు? యుద్ధములో చంపెనా? "అసహ్యవిషోగ్ర ధూమకేతనహతి జేసి"నాడు. స్వర్గమున కంపెనా? "కృతాంతనికేతనాతిథిని" చేసినాడు. అనగా నరకమున కంపినాడు (విషము వలన మరణించిన వారికి స్వర్గప్రాప్తి లేదు).

ఇదిగో ఇప్పుడు జనమేజయుని ముఖమున నుదంకు డాశించిన మార్పు కన్పించినది. ఇప్పు డాజ్యము పోయవలె. **(సశేషం)**

# విశిష్ట తెలుగు భాషా వైభవం- ఛందః ప్రాముఖ్యం

7

- డా. సంగనభట్ల నరసయ్య

## గణాలు ఎలా పుట్టాయి?

ఒక పాదం రాసిన కవి తరువాతి పాదం అంతే కొలతతో రాస్తాడు. అంటే మొదటి పాదం ఉచ్చరించడానికి ఎంత కాలం అవసరం పడుతుందో, అంతే కాలంలో ఉచ్చరించేలా తరువాతి పాదం పేరుస్తాడు. ఇది ఒక పాదం ఉచ్చారణాకాలం ఎంత ఉ ంటుందీ అంటే, ఆ పాదంలో వచ్చిన అక్షరాలను బట్టి లెక్క.

ఉచ్ఛ్వసిస్తే ప్రాణం
నిశ్వసిస్తే గానం   కదా

ఇక్కడ మొదటి పాదంలో ఎంత సమయం ఉచ్చారణకు పట్టిందో అంతే సమయంలో ఉచ్చరించేలా రెండో పాదం రాయబడింది. ఉచ్చారణకు ఎంత కాలం పట్టింది అంటే దాంట్లో ఉన్న అక్షరాల (విడివిడిగా) ఉచ్చారణాకాలాన్ని లెక్కించాలి. మొదటి పదంలో 7, రెండవ పదంలో 4 మాత్రల కాలం ఉచ్చారణకు కావాలి. ఎలా లెక్కించాలి? గురువు, లఘువు, గురువు, గురువు అని గుర్తించి 7 మాత్రలు అన్నాం. ఏ అక్షరాన్నైనా దానిలోని అచ్చును బట్టి గురువుగానో లఘువుగానో గుర్తించాలి. ఆ అక్షరంలోని అచ్చు(ప్రాణము)ను బట్టి లఘువు ఏకమాత్రాకాలంలో పలుకుతాం. గురువుకు ద్విమాత్రాకాలం.

ఏకమాత్రో భవేద్ధ్రస్వః
ద్విమాత్రో దీర్ఘ ఉచ్యతే
త్రిమాత్రాస్తు ప్లుతోః జ్ఞేయః
వ్యంజనం త్వర్ధమాత్రకం – యాజ్ఞ్యవల్క్యశిక్షా

అన్న ఈ వ్యాకరణశాస్త్ర శ్లోకం ప్రకారం ఒక మాత్ర హ్రస్వానికి, రెండు మాత్రలకు దీర్ఘంగా, మూడు మాత్రలకు ప్లుతంగా లెక్కించాలి (ఛందశ్శాస్త్రంలో ప్లుతం అక్కరలేదు). ఒక మాత్ర, రెండు మాత్రల అక్షరాలుగా మాత్రమే ఛందశ్శాస్త్రంలో గణనం ఉంటుంది. ఇక్కడ ప్లుతం ఉండదు. హల్లు – క్, గ్ – ఇలా అర్ధమాత్రకం. అయినా ఛందశ్శాస్త్రంలో పూర్ణ (ఏక) మాత్రికమే.

వ్యాకరణ శాస్త్రంలో స్వరాలు హ్రస్వ దీర్ఘ ప్లుతాలుగా త్రివిధంగా, ఉదాత్తానుదాత్తస్వరితంతో త్రివిధంగా ఉంటాయి. ఛందశ్శాస్త్రంలో దీర్ఘాలు మాత్రమే లెక్క. ప్లుతం ఉచ్చారణలో వచ్చిన దీర్ఘం కిందే లెక్క. అంటే గురువుగానే గుర్తించాలి. వ్యంజనం(హల్లు) అర్ధమాత్రకం ఐనా ఒక మాత్ర కిందే (Round off) లెక్క. హ్రస్వం లఘువు. దీర్ఘం గురువు. లఘువు అంటే ఒక మాత్ర(చిన్నది అని అర్థం). గురువు(పెద్దది) అంటే రెండు మాత్రలు. మాత్ర అంటే ఇవ్వాల్టి కాలప్రమాణంలో ఒక సెకను. "నిమేషోన్మేషాభ్యాం అన్యతరేణ తులితః కాలః మాత్రః (రెప్ప మూసినా, తెరచినా దానికెంత కాలం పడుతుందో దానికి సమానమైన కాలం మాత్ర) అని ఛందశ్శాస్త్రంలో కొలత. లఘువు పక్కన పొల్లు హల్లుంటే $1^{1}/_{2}$ మాత్రల కాలం ఐనా రెండు మాత్రలుగా నింపుకుని గురువుగా భావించాలి. రుక్ అంటే రు, క్ యొక్క ఊనిక కారణంగా, గురువే. రు(1)+క్$(^{1}/_{2})$ = $1^{1}/_{2}$ నిండగా 2 అంటే గురువు. ఈ నియమంతో లమ్(లం) అత్ త(అత్త), రిః(రిహ్), అక్షయ(అక్షయ) వంటివి మొదటి అక్షరాలు సహజలఘువులైనా గురువులుగానే లెక్క. ఈ విధానంలో కొలిస్తే పై పాదం (ఉచ్ఛ్వసిస్తే ప్రాణం)లో 11 మాత్రల కాలం ఉచ్చరించడానికి అవసరం అని లెక్కవేశారు. లఘువును గురువుగా లెక్కించడానికి పక్క అక్షరం యొక్క ఊనిక(ఒత్తిడి) మొదటి అక్షరం మీదే పడుతుందని మొదటి అక్షరాన్ని గురువు చేసి సంయుక్తంలో మిగతా హల్లును లఘువు గానే భావించారు. అత్ త (అత్త). ఈ రహస్యం వల్ల 'నాకు ప్రాణం' అనే వాక్యంలో 'కు' లఘువే. ప్రా వల్ల 'కు' గురువు కాదు. కుప్రాణం అని చదవం. నాకు అనే పదం తరువాత ఒక అక్షరకాలం విశ్రాంతినిస్తాం. అది రతలో కూడా రెండు పదాల మధ్య ఒక అక్షరకాలం స్థలం వదులుతాం. 'కులబ్రాహ్మణుడు'లో 'ల' మళ్లీ గురువే అది ఏకపదం(సమాసం) కనుక పదాంత విశ్రాంతినివ్వక లబ్రా అనే చదువుతాం కనుక. సంయుక్తాక్షరంలో ఎన్ని హల్లులున్నా (చ్ఛ్వ) గురువు కాదు. (ఉచ్+ఛ్వ గా లెక్కించి) మీద 'ఉ'ను మాత్రం గురువుగా లెక్కించాలి. **(సశేషం)**

అవధానపుష్కరిణి అన్ని సంచికలూ ఒకేచోట. ఈ QR కోడ్ స్కాన్ చేస్తే అంతర్జాలంలో ఇప్పటివరకు వచ్చిన అన్ని సంచికలూ ఒకేచోట కనపడు తాయి. అక్కడే చదువుకోవచ్చు లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

# నిఘంటు పరిజ్ఞానం 6

శతావధాని **ఆముదాల మురళి**

## సౌభరి నిఘంటువు

ప్రణమ్య సుధియాం నాథం దేవదేవం రమాపతిమ్ ।
ఏకార్థనామమాలాం తు కుర్వే చేతః ప్రసాదనీమ్ ॥

సౌభరి నిఘంటువు దెక్కన్ కాలేజ్, పూనా వారిచే 1955 లో ప్రచురించబడినది. శ్రీ ఏకనాథ్ దత్తాత్రేయ కులకర్ణిగారు దీని సంపాదకులు. వారు అనూప్ సంస్కృత గ్రంథాలయం, బికినీర్ లోను, బండార్కర్ ప్రాచ్య పరిశోధనా కేంద్రం, పూనాలోను లభించిన నాలుగు వ్రాతప్రతులను పరిశీలించి ఈ నిఘంటువును వెలికి తెచ్చారు. వారికి లభించిన ఆధారాల ప్రకారం నిఘంటు కర్తయైన సౌభరి క్రీ.శ. 1639 వ సంవత్సరానికి ముందువాడు. ఇంతకు మించిన వివరాలేమి సౌభరి గురించి లభించలేదు.

ఈ నిఘంటువు రెండు విభాగాలుగా ఉన్నది. అందు మొదటి విభాగం నూరు శ్లోకాలు గల ఏకార్థనామమాల, రెండవ విభాగం 111 శ్లోకాలు గల ద్వ్యక్షరీ నామమాల, ఈ రెండు వందల పదకొండు శ్లోకాలలో 422 పదాల నానార్థాలు ఇవ్వబడ్డాయి. ఏకార్థ నామమాలలో మొదటి శ్లోకం ప్రార్థనాత్మకం. మిగిలిన శ్లోకాలలో 'అ' మొదలుకొని క్ష వరకు నానార్థాలు ఇవ్వబడ్డాయి.

హల్లులకు గుణింతాల క్రమంలో అర్థాలు ఇవ్వబడ్డాయి.

కో బ్రహ్మా కా మహీ దుర్గా కిః సుగ్రీవో రమాపతిః ।
ఆఖణ్డలోఽథ సూర్యో గ్ని ర్వ్యాధః కర్షక ఇత్యపి ॥
కీర్గజస్తురగో వ్యాలో జారో జీవః పిపీలికా।
ధరా రమా చ ద్విట్ రుట్ చ పురుషః పాట లశ్చ గౌః ॥
కుః పృథ్వీ కుః కుచః కూలం కూః కృత్యా భూరపి స్మృతా ।
కేః ప్రాణోఽర్కో మదః సారః క్లీబః కైః ప్రణతః శుచిః ॥
కోః కుర్కురోజనః శ్యావః శ్వానః శోకశ్చ కౌర్వృషః ।
కం శిరః కం సుఖం తోయం పయోదుఃఖం విషం భయమ్ ॥

కః = బ్రహ్మ; కా= భూమి, దుర్గ; కిః = సుగ్రీవుడు, విష్ణువు, ఇంద్రుడు, సూర్యుడు, అగ్ని, వేటగాడు, రైతు; కీః = ఏనుగు, గుఱ్ఱము, పాము, జారుడు, జీవుడు, చీమ, భూమి, లక్ష్మి, శత్రువు, మొలక, పురుషుడు, గన్నేరు, ఎద్దు; కుః = భూమి, స్తనము, దరి (గట్టు); కూః = కృత్య, భూమి, కేః = ప్రాణము, సూర్యుడు, మదము, సారము, నపుంసకుడు; కైః= ప్రణతి, శుచి; కోః = కుక్క, జనుడు, నల్లనివాడు, దట్టమైన, దుఃఖము; కౌః= ఎద్దు; కం = తల, సుఖము, నీరు, పాలు, దుఃఖము, విషము, భయము.

ఈ విధంగా క నుండి క్ష వరకు గల ఏకాక్షరాలకు మొత్తం 200కు అర్థాలు ఇవ్వబడ్డాయి. సంయుక్తాక్షరమైన క్షను కూడా ఇందులోనే చేర్చారు. హ వర్ణాత 'ళ' కారం చేర్చారు. కాని ళ గుణింతంతో ఉన్న పదాలను చెప్పలేదు. 'ళంతు పరం బ్రహ్మ సనాతనమ్' (ళ = సనాతన పరబ్రహ్మము) అని మాత్రమే ఇందు పేర్కొన్నారు. నానార్థ రత్నమాలలో 'ళ' సంబంధించిన ఆరోపం లేదు. కకారంబునకు సంబంధించి నానార్థ రత్నమాలలో కః, కం, కిం, కుః అన్న నాలుగు ఆరోపములు మాత్రమే ఉన్నవి.

అకారమునకు సంబంధించి నానార్థ రత్నమాల శ్లోకానికి ఏకార్థ నామమాల శ్లోకానికి ఉన్న సామ్య భేదాలను చూస్తే...

అకారో బ్రహ్మ విష్ణీశ కమఠేష్వంగణే రణే ।
గౌరవేఽన్తఃపురే హేతౌ భూషణేఽంఘ్రావుమేజ్యయోః ॥

(అః= బ్రహ్మ, విష్ణువు, శివుడు, తాబేలు, ముంగిలి, యుద్ధము, గొప్పతనము, అంతఃపురము, కారణము, భూషణము, పాదము, పార్వతి, యాగము)

అని నానార్థరత్నమాలలో ఉండగా ఏకార్థనామమాలలో

అః కృష్ణః శంకరో బ్రహ్మ శక్రః సోమోఽనిలోఽనలః ।
సూర్యః ప్రాణో యమః కాలో వసన్తః ప్రణవః సుఖీ ॥

(అః = కృష్ణుడు, శంకరుడు, బ్రహ్మ, ఇంద్రుడు, చంద్రుడు, అగ్ని, వాయువు, సూర్యుడు, ప్రాణము, యముడు, కాలము, వసంతము, ఓం కారము, సుఖమును పొందినవాడు)

అని ఉన్నది. రెంటినీ సమన్వయించుకోవడం వలన మరిన్ని అర్థాలు తెలిసే అవకాశం ఉన్నది.

ద్వ్యక్షర నామమాలలోని ఏకాక్షరాలన్నీ సంయుక్తాక్షరాలు. అవి కూడా గుణింత పద్ధతిలో ఉన్నాయి. 222 సంయుక్తాక్షరాలకు అర్థాలు, కొన్ని చోట్ల నానార్థాలు కూడా ఇవ్వబడ్డాయి, ఉదాహరణకు

క్ణః కణః క్ణాధరా క్ణిర్ధీః క్ణుః పుత్రః క్ణూర్హుతాశనః ।
క్ణైః కపాలీ స్మృతిః క్ణంతు వృక్ణం సాధు సమీరితమ్ ॥

(క్ణః = కణము, క్ణా= భూమి, క్ణిః = బుద్ధి, క్ణుః = పుత్రః, క్ణూః = అగ్ని, క్ణైః = శివుడు, జ్ఞాపకము, క్ణం = ముక్క) – ఇందులో అన్ని ఏకాక్షరాలకు నానార్థాలు లేవు. ఇది ఒక విశిష్టమైన నిఘంటువు. ఇందులోని ఏకాక్షరాలను ప్రయోగించడం లేదా మానడం అన్నది అవధాని విచక్షణపై ఆధారపడి ఉంటుంది. ప్రయోగించినా, అంత అవసరం రాకపోయినా తెలుసుకోవడం తప్పు కాదు కనుక అవధానులకు ఇటువంటి నిఘంటువుల పరిచయం అవసరమే. **(సశేషం)**

## 'దర్శనమ్' ఆధ్యాత్మిక వారపత్రిక ఆధ్వర్యంలోని 'నెల నెలా అష్టావధానం'లో భాగంగా జరిగిన

'అవధాన కళాపూర్ణ' శతావధాని

## శ్రీ నారాయణం బాలసుబ్రహ్మణ్యం గారి

అష్టావధానం 28. 02. 2026

**ముఖ్యఅతిథి:** శతావధాని డా॥ జి.యం.రామశర్మ

**సంచాలకులు:** మరుమాముల దత్తాత్రేయశర్మ

**నిషిద్ధాక్షరి:** డా॥ ఆచార్య ఫణీంద్ర

'అవధానవిద్యా వికాస పరిషత్' నెలకొల్పిన 'దత్తాత్రేయశర్మ' గరిమ

కం. శ్రీ(క)లన్(క)మా(త)లో(చ)ని(-)ల్పన్
(ల)చాలన్(త)మేల్(ద)జే(య)సి(-)న(ట)ంతస(ర)త్య(వ)శ్రీ(ల)తో
శ్రీలన్ మాలో నిల్పన్
చాలన్ మేల్ జేసినంత సత్యశ్రీతో
బాలల్ నేర్వ వధానము
తా లలి శ్రీ దత్తశర్మ తత్పరుడయ్యెన్

**సమస్య:** డా॥ చివుకుల శ్రీనివాసప్రసాద్

విష్ణువు మూలదైవమట విశ్వశుభంకర శంభుడుండగన్

ఉ. విష్ణువు శంభుడున్ గనగ విశ్వము గాచెడు మూలమూర్తులా
విష్ణువు శంభుడన్ జగతి వేరని పల్కుట దోషమౌను త
ద్విష్ణుని చిత్తమం దజుడు వెన్నుడు శంభునియందు నుండగా
విష్ణువు మూలదైవమట విశ్వశుభంకర శంభుడుండగన్

**దత్తపది:** దుర్భా కౌండిన్యసాయి

'గంగ-యమున-పెన్న-కావేరి' రామాయణార్థం/స్వేచ్ఛావృత్తం

మ.కననా పంక్తిరథుండు బాధ మును**గంగా** కైక భీష్మించి స
జ్జనునిన్ కానల కంపు ధ్యే**యమున** తాన్ సౌజన్యమున్ వీడ చి
ద్ఘను డా**పెన్న**భివంద్యగా దలచియున్ తల్లిన్ బలెన్ మ్రొక్కి బో
రన నేగెన్ వనికిన్ విధాతకృతముల్ లంఘ్యంబు **కావేరి**కిన్

**వర్ణన:** అయిలాపురపు వేరాంజనేయులు

శృంగేరీ శారదామాత అనుగ్రహం - స్వేచ్ఛావృత్తం

శా. అంగాంగమ్మున దివ్యమౌ కళలతో నాద్యంతమున్ లేని నీ
శృంగారాకృతి భావమందు నిలిచెన్ శ్రీ చిత్కళామాలినీ
పొంగెన్ చిత్తము మమ్ము కావు జననీ పూషాసహస్రోజ్జ్వలా
శృంగేరీగిరిసంస్థితా! స్మితముఖీ! శ్రీశారదా! సన్నుతుల్.




**యాంత్రిక గణితం:** జి.రఘురామశర్మ

సంఖ్య: 136

| | | | |
|---|---|---|---|
| 8 | 1 | 117 | 10 |
| 11 | 116 | 4 | 5 |
| 2 | 7 | 9 | 118 |
| 115 | 12 | 6 | 3 |

**కావ్యపఠనం:** ఎం.కృష్ణకిషోర్

1. ఎక్కడ లేరె వేల్పులు సమీప్సితదాతలు ముద్దుగూన నీ
వెక్కడ ఘోర వీర తపమెక్కడ యీ పటు సాహసిక్యమున్
తక్కు శిరీషపుష్పము అవధానపరత్వములున్ మధువ్రతం
బెక్కిన నోర్చునో విహగ మెక్కిన నోర్చునొ నిశ్చయంపుమా!

శ్రీనాథుడు రచించిన హరవిలాసం చతుర్థాశ్వాసంలోని పద్యం - మేనాదేవి తన కుమార్తె అయిన పార్వతితో అంటున్న మాటలుగా..

2. ఘనులాత్మీయతమోనివృత్తి కొఱకై గౌరీశు మర్యాద ఎ
వ్వని పాదాంబుజ తోయమందుమునుగన్ వాంఛింత రే నట్టి నీ
యనుకంపన్ విలసింపనేని వ్రతచర్యన్ నూఱుజన్మంబులన్
నిను జింతించుచు ప్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా!

పోతన రచించిన భాగవతం 'రుక్మిణీకల్యాణం' లోని పద్యం.

→→



# కంద గర్భ చంపకమాల

- చింతా రామకృష్ణారావు

మనం కంద గర్భ చంపకమాల ఎంత సులభంగా వ్రాయవచ్చునో తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

**చంపకమాల: న జ భ జ జ జ ర**

**I I I - I U I - U I I - I U I - I U I - I U I - U I U.**

ఇది చంపకమాల1వపాదము.

**I I I - I U I - U I I - I U I - I U I - I U I - U I U**

ఇది చంపకమాల 2వపాదము.

ఈ రెండు పాదములలో కందము రెండు పాదములు ఎలా అమరునో గమనించుదము.

మొదటి పాదములో మొదటి నగణమున ఉన్న మొదటి 2లఘువుల తరువాత అక్షరమునుండి కందపద్యము ప్రారంభమయి, న జ భ జ అనే గణాలలో జగణమున ఉండు మధ్యగురువు వరకు కందము మొదటి పాదము, తరువాత ఉండు లఘువుతో 2వ పాదము ప్రారంభమయి పాదాంతము వరకు సాగి, చంపకమాల 2వపాదములో మొదటి నగణము తరువాత వచ్చు జగణములోమధ్యగురువు వరలు కందము రెండవ పాదము పూర్తి యగును.

చంపకమాల.

**~II~ (I IUI UII IU)(I IUI IUI UIU)**

**III IU) ~ I UII IUI IUI IUI UIU**

కందం. 1, 2 పాదములు

**(I IU I UI I IU)**

**(I IU I IU I UI U – III IU)**

ఇదే విధముగా 3 , 4 పాదములు కూడా అమరును.

ఈ పాదాలు కంద లక్షణాలతో ఉండేలా చూచుకొంటూ భావయుక్తంగా ఉండేలా చూచుకోవాలి. ప్రయత్నిద్దాం.

**జయగణనాయకా! సుగుణ సాంద్ర! నయోద్ధతి,శోభ నిమ్ము, నన్**
**దయ గను మాత్మలో సతము ధర్మ నిబద్ధత చక్కనిమ్ము, ని**
**ర్భయ వినయాదులన్, సుగుణ వర్ధన నిమ్ము ప్రశోభితాంగ! రా**
**వయ! కనఁగా ననున్, లలిత భావన నిమ్ము కళాప్రపూర్ణమా!**

**~జయ~**
**(గణనాయకా! సుగుణ సాం)**
**(ద్ర! నయోద్ధతి,శోభ నిమ్ము, నన్**
**దయ గను మా)**
**~త్మలో సతము ధర్మ నిబద్ధత చక్కనిమ్ము, ని~**
**~ర్భయ~**
**(వినయాదులన్, సుగుణ వ)**
**(ర్ధన నిమ్ము ప్రశోభితాంగ! రా**
**వయ! కనఁగా)**
**~~ననున్, లలిత భావననిమ్ము కళాప్రపూర్ణమా!~**

**గర్భకవిత్వము**

ఈ కందగర్భ చంపకమాల పద్యములో జయ గణనాయకా అనే పదములలో జయ కారకుఁడవైన గణనాయకా!అని సంబోధించాము. జయకారకుఁడవైన అనే అర్థాన్నిచ్చే పదం మినహాయించినను అర్థములో కుంటుబాటు రాదు. కావున కందంలో గణనాయకా అని సంబోధనతో (మిగతా 12వ పేజీలో)

**3. ఇనవంశోద్భవుడైన రాఘవుడు భూమీశాత్మజుల్ వేడ్కతో**
**దను వీక్షింప మునీశ్వరుం డలర కోదండంబు చేనంది చి**
**వ్వన మోపెట్టి గుణంబు వట్టి పటుబాహాశక్తితో దీసినన్**
**దునిగెన్ చాపము భూరిఘోషమున వార్ధుల్ మ్రోయు చందంబునన్**

మొల్ల రామాయణంలోని రాముడు విల్లు ఎక్కుపెట్టిన సన్నివేశం

**4. ఆటంబాంబుల బీటవాటినది బ్రహ్మాండంబు సద్భావమే**
**మోటైపోయెను పంచశీల పథకమ్ముల్ దుమ్మువట్టెన్ దురా**
**శాటోపమ్ముల హద్దు మీఱినది పోరాటమ్మె యారాటమై**
**లూటీ చేసిరి మానవత్వమును నాలోకింపు లోకప్రభూ!**

కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారి 'బుద్ధదేవుని పునరాగమనము' అనే ఖండిక లోనిది.

**ఆశువు: మంకాల మానస**

**1. సంగీతవిభావరిలో 'పాహి భారతీతీర్థం' పదం వచ్చినపుడు భారతీతీర్థ స్వామివారి చిత్రపటం పైన ఉన్న పుష్పం రాలిన సందర్భం**

తే.గీ. పరమ భాగవతోత్తముల్ భద్రమతులు
భారతీతీర్థ గురుదేవ పదమునుండి
పుష్పమొక్కటి వ్రాలెను బుధుల కెల్ల
దీవనము లిచ్చినట్లు నా భావనమ్ము!

**2. తెలుగును ఇంగ్లీషులో చెప్పవలసిన స్థితి రావటంపై**

మ. తెలుగుం జూచిన నేటి కాలమున ఎంతే దైన్యభావంబులున్
గలుగుం గావున మాతృభాషకొఱకై కర్మిష్ఠులై పాలకుల్
వెలుగుల్ నింపుచు ముందుకేగవలయున్ విశ్రాంతి లేకుండగన్
అలుగంబోవకు విట్టుబాబు! యిటు లీ యష్టావధానంబునన్

**3. పెద్దవాళ్ళు వృద్ధాశ్రమాలు, పిల్లలు హాస్టల్ – ఇంట్లో జంతువులు**

తే.గీ. చేర్చగూడని వాటిని చేర్చి యింట
సేవలను జేయు దౌర్భాగ్యస్థితియు నేడు
దాపురించెను మానసా! దగ్ధమయ్యె
మనసు! ఏమి చెప్పెదనమ్మ మాటలికను

**4. సి.వి.సుబ్బన్న గారి శబ్దప్రభుత్వం – నిషిద్ధాక్షరి చేయలేక పోయిన ప్రాశ్నికుడి భావన**

శా. శబ్దప్రౌఢిమ దివ్యదీప్తశిఖయై ప్రాజ్వల్యమై యొప్పగా
లబ్ధశ్రేష్ఠులు పృచ్ఛకాళి పదముల్ రాకున్న నవ్వేళలో
శబ్దం బేమియు రానివారలగుచున్ సర్వాత్మనా మెచ్చుచున్
ఆబ్ధిత్వంబది శబ్దశాస్త్ర గరిమన్ హ్లాదంబు నందించెడున్

**అప్రస్తుత ప్రసంగం: పంతుల విట్టుబాబు**

# పద్యపరిమళం

"సతులు మాయాధుర్య చతురల్గదే" "యౌర!
యా మాట బల్క మేలగునటోయి"
"జవరాండ్రు కుటిల ప్రచారుల్ గదే" "యౌర!
నడిమిటి మాట మానవుగదోయి"
"బింబోష్ఠులవసర ప్రియమతుల్గదె" "యౌర!
"యసమాన చతురుడవగుదువోయి"
"జవ్వనుల్ శోకభాజనులు గదే" "యౌర!
"కలగించిపల్కుట కదలటోయి"!
"గరితలాత్మనిజోద్యముల్ గదవె" "యౌర!
"నీహితంబుగ పల్కుట నెరవటోయి"
"వెలది! నీవాని పల్కుట వింత గాదె"
"మేలు వాదగ బఱచి నన్నేలు సామి"

ఈ పద్యం చెళ్ళపిళ్ళ నరసకవి రచించిన యామినీ పూర్ణ తిలకా విలాసము అనే శృంగార కావ్యం లోనిది. వీరు శతావధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారి పిన ముత్తాత. బిల్హణ కవికి యామినీ పూర్ణ తిలక అనే రాజకుమారికి మధ్య ప్రేమోత్పన్న సంఘటనల సమాహారమే ఈ కావ్యవస్తువు. ఈ పద్యం చివరి ఏడవ ఆశ్వాసంలో చివరలో వచ్చిన పద్యం.సాధారణంగా కావ్యాంతాల కావ్యాంశం నాయికానాయికల విరహవేదన ముగిసి సౌఖ్యసమాగమ సన్నాహ మార్గాన్వేషణతో సుఖాంతం అవుతుంది.ఇక్కడ కూడా బిల్హణకవి, యామినీ పూర్ణ తిలకల మధ్య ప్రణయ ప్రస్థానం ఒడిదొడుకుల రహదారులపై సాగి వేదనామయమై చివరికి అన్ని ఇబ్బందులనూ అధిగమించి ప్రేమ సఫలమై ఇద్దరూ ఒక్కటవుతున్న సందర్భం లో వారి ప్రణయ సంభాషణ ఇది.

శబ్దభావ పద ప్రయోగాలు మరీ చిత్రంగా లేకున్నా చిన్న చిన్న వర్ణ సవరణలతో కాస్త చమత్కారం సాధించారు కవి.

"సతులు మాయాధుర్య చతురల్గదే" అని బిల్హణుడు అంటే "యా మాట పల్కడం మేలుకాదు కదా" అని యామిని బదులిచ్చింది. సతులు తమ మాయాజాల చతురతతో మగవారిని వలపుల వలలో పడేస్తారు కదా అని అనగానే యా మాట ఎందుకు అనడంలో మాయాధుర్య అనే పదంలో "యా"ఎందుకు? దానిని తీసివేయమని సతి గోముగా పలికింది. మాయాధుర్య లో యా తీస్తే మాధుర్య అవుతుంది. తీయని వలపు మధురిమలు అందజేసే చతురులు సతులు అన్నది ఆమె సమాధానం. ఇదీ చమత్కారం. ఇలాగే ప్రతీపాదమూ.

**రెండవ పాదంలో**

"జవరాండ్రు కుటిల ప్రచారుల్ గదే" అని అనగా నడమటి మాట మానమని ఆమె సూచన. అంటే కుటిల లో "టి" తీసివేస్తే కుల అవుతుంది. జవరాండ్ర కుల ప్రచారం యవ్వన సౌఖ్య సమాశ్రయం కదా దానిని పొందమని ఆమె సూచన." బింబోష్ఠులవసర ప్రియమతుల్గదె" దొండపండు లాంటి పెదవి గల వనితలు అవసర ప్రియమతులు అంటే సరసమవసరం అనుకున్నప్పుడే ప్రేమ జూపే మతి గలవారు అని బిల్హణుడు అనగా "యసమాన చతురుడవగుదువోయి" అని ఆమె సమాధానం. బింబోష్ఠుల అధరామృతం అందుకోవడంలో చతురుడవు అనడం సాధారణ అర్థం కాగా అవసర కు స కలిపి సరస ప్రియమతులు కదా సతులు అని బదులిచ్చింది.

"జవ్వనుల్ శోకభాజనులు గదే" విలాసవతులు అందీ అందక ఏడ్పిస్తారు కదా అంటే "కలిగించి పల్కుట కలదటోయి" అని ఆమె సమాధానం. అలా లేనిపోనివి కల్పించి చెప్పడం ఎందుకు అని సాధారణ అర్థం కాగా "క" ను కలిపి పల్కుట ఎందుకు అంటే క తీసి వేస్తే శోభా జనులు అవుతుంది.జవ్వనులు అందంగా ఉండేవారు కదా అన్నది అంతరార్థం.

"గరితలాత్మనిజోద్యముల్ " ఆడవారు ఆత్మ తృప్తి (స్వంత సౌఖ్యం) కోసం పరితపిస్తారు కదా అంటే నీ హితంగా పలుకడం నెరవు అవుతుంది. నెరవు అంటే పూర్తి, పూర్ణము, అధికము అనే అర్థా లున్నాయి. నీవు కలిస్తేనే కాంక్ష పూర్ణమవుతుంది అని ఆమె సమాధానం.

"వెలది నీవాని పల్కుట వింత గాదె"

ఇలా నీవు అని పలుకడం వింత కదా ఆని అంటే తగిలి, స్పర్శించి అనే అర్థంలో ఈ స్పర్శ ఎంత వింతగా ఉందో అని అంటే

"మేలు వాదగ బఱచి నన్నేలు సామి"

"మేలు" అంటే వలపు, మదము అనీ "వాద" అంటే ఎత్తునుండి వచ్చిన నీరు తగిలే ఒంపులో ఉన్న భూమి అనీ అర్థాలున్నాయి. నీవాని పలుకకుండా ఒంపుభూమిలా క్రింద ఉన్న నన్ను వలపుతో ఆక్రమించుకో స్వామీ అని అంతరార్థం. **-చేపూరి శ్రీరాం**

(11వ పేజీ తరువాయి) **గర్భకవిత్వము**

పద్యం ప్రారంభ మగుట సముచితముగ ఒప్పియుండును.

కందపద్యమునకు పరిపూర్ణమైన భావము కలదని మనము గ్రహింపవచ్చును. అటులనే చంపకమాల కూడా అర్థపుష్టికలిగి ఒప్పి యుండుట మనము గ్రహింప వచ్చును.

మనము ఈ పద్యమున గర్భస్థమైన తేటగీతిని కూడా గుర్తించవచ్చును.

సుగుణ సాంద్ర! నయోద్ధతి,శోభ నిమ్ము,
సతము ధర్మ నిబద్ధత చక్కనిమ్ము,
సుగుణ వర్ధన నిమ్ము ప్రశోభితాంగ!
లలిత భావన నిమ్ము కళాప్రపూర్ణ!

# పూరణతోరణం

నిర్వహణ: 'అష్టావధాని' కంది శంకరయ్య

## సమస్య

"నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ గదా"

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు**

వృత్తాంతమ్మును చెప్ప పూనుకొని నావేశమ్ముతో చూచుచున్
చిత్తమ్మందున కోర్కె పెంపెసగగా చిచ్ఛక్తి చూపించుచున్
మత్తున్ వీడుచు బొట్టె తొట్రుపడి సమ్మానమ్ముతో పల్కగా
నత్తిన్ గల్గిన వాని వాక్పటిమ కర్ణ ప్రీతిన్ గూర్చున్ గదా!

**ఆరవల్లి శ్రీదేవి, హైదరాబాదు**

కత్తిన్ జూపుచునుత్తరించెదననన్ కంఠమ్ముపై నుంచగా
బత్తిన్వేడుచు రక్షరక్ష యనగా విశ్వేశునే గొల్చుచున్
చిత్తంబందున విష్ణురూపు దలచన్ శ్రీమంత్రమున్ బల్కగా
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణప్రీతిన్ గూర్చున్ గదా!

**కవుతా రామకృష్ణ**

విత్తాదృష్టరమాదయేక్షణము లీ పృథ్వీతలంబందునన్
హత్తంగానొక నత్తివానిఁ దన భాగ్యాధిక్యమోయంచనన్
బుత్తెంచున్ జనకోటి సంస్తుతులలో ముంచెత్తగాఁ జోద్యమా
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ గదా!

**కళోర్ఘుల నాగేశ్వర్ శర్మ, ధర్మపురి**

రిత్తన్ బోవగ జీవనమ్ము గడిపెన్ రిక్తాస్యుడై కానలన్
నత్తిన్ గల్గిన యో యనామకుడు వీణన్గల్గు మూర్తిన్గనెన్
సత్తిన్ దెచ్చుకొనంగ మ్రొక్కఁగనిడెన్ శక్తీశ్వరీ,విద్యలన్
నత్తిన్ గల్గిన వాని వాక్పటిమ కర్ణ ప్రీతిఁ గూర్చున్ గదా

**కొరుప్రోలు రాధాకృష్ణ రావు**

చిత్తంబందున హాస్యలాస్యములతో చిత్రంబు సిద్ధంబునై
యొత్తైత్తౌ సుమసాహితీసుధలతో నింపైన దృశ్యంబులున్
మత్తేభంబుల పద్యపాదములను నృన్నించు వైచిత్రితో
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ గదా!

**గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు**

చిత్తంబందున కాళికా జననినే సేవించి విద్వత్తునన్
ముత్తెంబయ్యెను కాళిదాసు కవియై భోజుండు గీర్తింపఁగన్
సత్తెంబెంచఁగ మాత వాణి కరుణన్ సాధింప నభ్యున్నతిన్
నత్తిన్ గల్గిన వాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ గదా!

**పి.ఎల్. నాగేశ్వర రావు, హైదరాబాదు**

చిత్తంబందున భక్తినిల్పి కవి తా శృంగేరి పీఠమ్మునన్
గత్తుల్ దూసి వధానమందుఁ గవితాగాంభీర్యమున్ జూపుచున్
దత్తాంశంబుల నప్పచెప్పు దరి వ్రాతన్ జూపె! లేకున్న నా
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణ ప్రీతిఁ గూర్చున్ గదా!

**పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు**

విత్తంబొందిన నీతి బాహ్యుడటు నిర్భీతిన్ మురారిన్ మదో
న్మత్తుండై బహు నిందఁ జేయఁ గనలన్ మాన్యుండు సద్వర్తనన్
జిత్తంబందున నచ్యుతున్ గొలిచి సుశ్రేయంబులన్ బల్కఁగన్
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ సదా!

**మంకు శ్రీను, కొప్పరు, ప.గో. జిల్లా**

సత్తిన్ జంపును శ్రోతృపాళికిలలో శ్రావ్యంబుగాలేని- ఆ
నత్తిన్ కల్గినవాని వాక్పటిమ- కర్ణప్రీతి కల్గున్ కదా
బత్తిన్ శాస్త్రవివేకవంతుడొకచో వాక్రుచ్చుచో వేదికన్
ఎత్తున్ పత్రికలెల్ల వాని పటిమన్నీ విశ్వముల్ మెచ్చగన్.

**రాకుమార, గోదావరిఖని**

చిత్తంబందువిషంబులేక సుధలన్ చిందాడునందమ్ముతో
పెత్తందారుతనంబుజూపుదొరయై వేదాత్మసంభూతమౌ
పొత్తిళ్ళన్ సుఖియించునింటిసిరియౌ బుజ్జాయిముచ్చట్లలో
నత్తిన్ గల్గిన వానివాక్పటిమ కర్ణప్రీతిగూర్చున్ గదా.

**విమల ఆర్యసోమయాజుల, బెంగుళూరు**

ముత్తాతల్ ఘనపారు లంచు, తన సమ్మోదంబునే దెల్పి, మే
నత్తే కూతునొసంగె నాదరముతో నల్లుండటంచున్ వెసన్
మత్తున్ ముంచిరి మద్యమే యొసగి, నామాధుర్య వాగ్ధాటిలో
నత్తిన్ గల్గిన, వాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ గదా.

**డా. వేదాల గాయత్రీదేవి**

చిత్తమ్మందున ప్రేముడిన్ నిలుపుచున్ చిన్నారి సంభాషణల్
ఒత్తుల్ పల్కగలేని వేళనయినన్నుత్సాహమందించు నా
సత్తిన్ తలిదండ్రి మెచ్చునవనిన్ సంతోషముప్పొంగ నా
నత్తిన్ కల్గినవాని వాక్పటిమ కర్ణప్రీతి గూర్చున్ గదా!

**వేమరాజు వేంకట కృష్ణ కుమార్**

కత్తిన్ పట్టిన బాలకృష్ణ వలె శృంగారంబు చిందించు చున్
చిత్తంబందున నారసింహుగని జేజేలంచు పల్కన్ సదా
మత్తున్పొం దియు మెచ్చు ప్రేక్షకులు; కామాంధంబుగా నెంచు నా
నత్తిన్ గల్గిన వాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ కదా!

**డా. శాస్త్రుల రఘుపతి, హైదరాబాద్**

విత్తమ్మే తన జీవితాశయముగా వేవేలుగా దాచు ఉ
న్మత్తున్ భ్రష్టుని చుట్టు జేరిన జనమ్ముందున్ స్తుతుల్ జేయునా
తొత్తుల్ గా భజియించు వారలకు నా ధూర్తాగ్ర దుష్టాళికిన్
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ సదా.

**శిష్టా వి.ఎల్.ఎన్. శర్మ, హైదరాబాద్**

వత్తుల్బల్కగలేడు సంగతిని సంభావించి భాషించగా
భిత్తంబందుచు సాగదీయునట దాపించంగ నావృత్తమున్

చిత్తంబందున నిల్పి భావనల రోచిన్నింపు నావాక్యమున్
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణ ప్రీతి గూర్చున్ గదా!

## దత్తపది

**'దోమ - ఈగ - చీమ - బల్లి' పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ మత్తేభ వృత్తంలో 'చరవాణి'పై పద్యం**

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు**

మ. మనమున్ గైకొనె నెట్టిదో మహిమచే మత్తెక్కగా జేసె ద
క్షిణ హస్తమ్మది జేరి శీఘ్రమ్ముగ, పూచీ మన్ననన్ వీడినన్
వణిజుం, డీగతి పొందుచుండిరి జనుల్, భావించి భాగ్యమ్ముగా
ఘనమౌ నీ చరవాణి బల్లిదులు, సత్కారమ్ముగా గైకొనన్.

**ఆరవల్లి శ్రీదేవి, హైదరాబాదు**

మ. ధరపై దోమని పళ్ళెరమ్ములటులన్ తండ్లాడుటేలీలగా
వరుసల్ గట్టరె యీాగదంచుమరితావాదించి కయ్యాలచే
పరుసంబాడుచు చీమకాలుగన చర్వాణిన్ వరించున్నిత్యమున్
వరసౌవానికిబల్లిదుల్వైరసి నవ్వారింబ్రశంసింపగా!

**కశోర్ఘుల నాగేశ్వర్ శర్మ, ధర్మపురి**

మ. ఇది యేదో మన చేతిలోనిమిడి యంతర్జాలమున్జూపుచున్
మదులందీగగ యింపుగాను మన ప్రీత్యభీష్టముల్దీర్చగన్
కదిలించీ మన జీవితమ్ముల్మ గడపన్నత్యద్భుతంబౌ; సుబ
ల్లిదమైనట్టి యనన్య ప్రజ్వలిత సద్విద్యా ప్రవాహమ్మయెన్.

**గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు**

మ. చరవాణిన్ గనఁ గ్రమ్ము దోమటియె! హస్తంబందునన్ భూషయై
ధరపై పిల్లలు పెద్దలీగతిని విద్యాధిక్యులై దానిదౌ
జెరలో బల్లిదమంద్నఁ జిక్కి బలియై జీవింత్రు నాశాన, కొం
దరె వృద్ధిన్ సురుచీమయంబు గనెడున్ ధ్యాసన్ బ్రవర్తిల్లరే

**పి.ఎల్. నాగేశ్వర రావు, హైదరాబాదు**

మ. కరమందో మహతీ యనంచు నిను నొక్కం జూడ నుత్సాహులై
యరయన్ బల్లిదురాలియై తలచి భార్యాభర్తలే వీడుచో
మరి చీమంతయు జాలిలేక, ధర దుర్మార్గంబు హెచ్చెన్ వడిన్!
చరవాణీ! ప్రజ యీ గతింబడిరి 'నిశ్శబ్దంబు' నిన్ వాడుచో!

**పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు**

మ. కరమందొప్పుచు స్టఁడు దోమడికి నిక్కంబెంచఁగన్ మిన్నయై
నరులన్ గట్టె గదయ్య యీ గతిని విన్నాణమ్ముతో దాసులై
వరలన్ మిక్కుటమౌ రుచీ మహిమ మేపారంగఁ జిత్తంబునన్
జరవాణీ స్థిత బల్లిదమ్ముల్మ గని దుస్సాధ్యమ్ము వర్ణించఁగన్.

**రాకుమార, గోదావరిఖని**

మ. ద్యుతి సూచీమయరాగబంధనుడి మాధుర్యంబుజేకూర వి
స్తృతమౌరీతిని పెద్దదో మదినిసంజాయింప చిన్నారియై
స్మృతిపాఠమ్ములువీనులందొరల సంచారింపుజుంటీగయై
సతతం బల్లిదశస్త్రమైనొదిగె విజ్ఞానంపుసంగాతినన్.

**విమల ఆర్యసోమయాజుల, బెంగుళూరు**

మ. వినరా'దో మ'రి వీనులంబడెడు నావిజ్ఞాన సర్వస్వమున్
ఘన వాక్చాతురి గల్గు' నీగ'తిని సంకల్పంబు చేయంగ ,ద
ల్చిన దివ్యుండు, మహానుభావుడు ,విపం'చీమంజునాదంబుతో
ఘనమౌశక్తిని గూర్చు,బల్లిదుని మేథాశక్తి సామాన్యమే.

**డా. వేదాల గాయత్రీదేవి**

మ. వినగా మోజును పెంచదో,మనములో వేరీతి ఘోషించుచున్
కనగా నేడిది బల్లిదంపు తొడవై కాలంబునేదోచెడిన్
మునుగన్ జేయు,వివాదవాదములలో ముచ్చట్లతోనీగతిన్
మనహస్తంబున భూషయయ్యె,సురుచీ!మాయావి చర్వాణియే.

**డా. శాస్త్రుల రఘుపతి, హైదరాబాద్**

మ. గమనింపం గనలేరుగా జనుల "ఈగ"మ్యమ్ము తామెంచగన్
సమయమ్మున్ మదిగాంచకన్ వృథగ నిచ్ఛాశక్తినే"దో మ" హో
ద్యమమున్ సల్పెదు వారి బోలె ధరణిన్ వ్యర్థమ్ముగా "బల్లి"దుల్
తమితో నాచరవాణి మాయల పడన్ తామెన్నరౌ "చీ మ"దిన్.

**సమస్య:** దేహము నిత్యమ్మటంచు దేశికుఁ డనియెన్

**దత్తపది:** 'మూడు - ఆరు - ఏడు - పది' పదాలను ప్రయోగిస్తూ భారతార్థంలో - స్వేచ్ఛాఛందంలో

(పూరణలు **15 ఏప్రిల్ 2026** లోపు **7702121376** ఫోన్ నంబరుకు పంపాలి)

**ప్రకటన**

అవధానకళ భావితరాలకు నిరంతరాయంగా ప్రవహింపజేయడంలో మా వంతు కృషిగా అవధాన విద్యను యువతరానికి బోధించడానికి, **'అవధాన విద్యా వికాస పరిషత్తు'**ను ఏర్పాటు చేసి 2022వ సంవత్సరం నుండి నాలుగేళ్ళుగా 'భాగ్యనగరం'లో ఏడురోజులపాటు **'అవధాన శిక్షణ శిబిరాలను'** నిర్వహిస్తూ వస్తున్నాం. అలాగే ఈ 2026వ సంవత్సరం కూడా **మే 18 నుండి 24 వరకు** శిక్షణ శిబిరం ఏర్పాటు జరుగుతుంది. వేదిక సెయింట్ మార్క్స్ హైస్కూల్, దీనదయాల్ నగర్, నేరేడుమెట్టు, మల్కాజిగిరి, హైదరాబాద్. వివరాలకు 9441039146, 8555082034 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు. **- సంపాదకులు**

# పద్యకవిత్వము సాధుప్రయోగాలు - 7

- 'అష్టావధాని' చిటితోటి విజయకుమార్




## విసర్గ సంధులు

తెలుగు పద్యాలలో విసర్గ సంధులను అనివార్యంగా ప్రయోగిస్తుంటాము. ఈ సంధుల ప్రయోగాలలో కొన్ని దోషాలు దొర్లే అవకాశం ఉన్నందున ఈ వ్యాసంలో మొదటగా సామానంగా వచ్చే విసర్గసంధులను, తరువాత సంచికలో విశేషమైన విసర్గసంధులను తెలుసుకొందాం.

సామానంగా వచ్చే విసర్గ సంధులను నాలుగు సెట్లుగా (సమూహాలుగా) విభజిద్దాము.

1. **విసర్గకు పూర్వం హ్రస్వ అకారం ఉన్నప్పుడు ఏర్పడే సంధులు**
2. **విసర్గకు పూర్వం దీర్ఘ ఆకారం ఉన్నప్పుడు ఏర్పడే సంధులు**
3. **విసర్గకు పూర్వం అఆలు కాకుండా ఇతర అచ్చులు ఉన్నప్పుడు ఏర్పడే సంధులు**
4. **విసర్గకు పూర్వం ఏ అచ్చు ఉన్నా విసర్గ తరువాత కఖ, చఛ, టఠ, తథ, పఫ, శ, ష, స అక్షరాలు ఉన్నప్పుడు ఏర్పడే సంధులు**

ఇప్పుడు ఈ సంధులను వీలైనంత సరళంగా తెలుసుకొందాం. ఈ వ్యాసంలో పాణినీయప్రక్రియ బదులు సౌలభ్యం కొఱకు మనకు తేలికగా అర్థమయ్యే ప్రక్రియను వివరిస్తాను.

### 1. విసర్గకు పూర్వం హ్రస్వ అకారం ఉన్నప్పుడు ఏర్పడే సంధులు

1.1 విసర్గకు పూర్వం హ్రస్వ అకారం ఉండి విసర్గ తరువాత కూడా హ్రస్వ అకారం ఉన్నప్పుడు – విసర్గకు పూర్వంగా ఉన్న హ్రస్వ అకారం, విసర్గ మరియు విసర్గ తరువాత ఉన్న హ్రస్వ అకారం – ఈ మూటి స్థానంలో ఓకారము వస్తుంది. వ్రాతలో "ఓఽ" అని వ్రాస్తారు.

శివః + అహం = శివ్ (అః + అ) హం = శివ్ (ఓఽ) హం = శివోఽహం

కః + అహం = క్ (అః + అ) హం = క్ (ఓఽ) హం = కోఽహం

**1.2** విసర్గకు పూర్వం హ్రస్వ అకారం ఉండి విసర్గ తరువాత హ్రస్వ అకారం తక్క మరేదైనా అచ్చు (ఆ నుంచి ఔ వరకు) ఉన్నప్పుడు, వికల్పంగా విసర్గ స్థానంలో యకారం వస్తుంది లేదా విసర్గ లోపిస్తుంది.

మనః + ఆశయము = మనయాశయము, మన ఆశయము

స "ద్య ఉదస్విత్తున గాక ఏ గతి నుదన్యావహ్ని చల్లారెడిన్" (ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారి పూరణ). ఇందులో సద్యః + ఉదస్విత్తు = సద్య ఉదస్విత్తు (ఒక్కసారి విసర్గ లోపించాక సవర్ణదీర్ఘసంధి కానీ, గుణసంధి కానీ రాదు. సద్య + ఉదస్విత్తు = సద్యోస్విత్తు కాదు.

**1.3** విసర్గకు పూర్వం హ్రస్వ అకారం ఉండి విసర్గ తరువాత గఘఙ, జఝఞ, డఢణ, దధన, బభమ (వర్గ 3, 4, 5 అక్షరాలు) మరియు యరలవహ అక్షరాలు ఉన్నప్పుడు "అః" అనేది "ఓ" గా మారుతుంది. ఈ సంధి తెలుగు పద్య సాహిత్యంలో విస్తృతంగా కనిపిస్తుంది.

యశః + బలము = యశ్ (అః) + బలము = యశ్ (ఓ) + బలము = యశోబలము

మనః + హరము = మన్ (అః) + హరము = మన్ (ఓ) + హరము = మనోహరము

సరః + జము = సర్ (అః) + జము = సర్ (ఓ) + జము = సరోజము

### 2. విసర్గకు పూర్వం దీర్ఘ ఆకారం ఉన్నప్పుడు ఏర్పడే సంధులు

**2.1** విసర్గకు పూర్వం దీర్ఘ అకారం ఉండి విసర్గ తరువాత ఏదైనా అచ్చు (అ నుంచి ఔ వరకు) ఉన్నప్పుడు, విసర్గ స్థానంలో యకారం వస్తుంది లేదా వికల్పంగా విసర్గ లోపిస్తుంది. అయితే తెలుగు పద్యప్రయోగాలలో ఈ సంధి సాధారణంగా కనిపించదు.

గజాః + ఇవ = గజా ఇవ

**2.2** విసర్గకు పూర్వం దీర్ఘ ఆకారం ఉండి విసర్గ తరువాత గఘఙ, జఝఞ, డఢణ, దధన, బభమ (వర్గ 3, 4, 5 అక్షరాలు) మరియు యరలవహ అక్షరాలు ఉన్నప్పుడు విసర్గ స్థానంలో యకారం వస్తుంది లేదా వికల్పంగా విసర్గ లోపిస్తుంది. అయితే తెలుగు పద్యప్రయోగాలలో ఈ సంధి సాధారణంగా కనిపించదు.

బాలాః + హసంతి = బాలాయ్ హసంతి, బాలా హసంతి

### 3. విసర్గకు పూర్వం అఆలు కాకుండా ఇతర అచ్చులు ఉన్నప్పుడు ఏర్పడే సంధులు

**3.1** విసర్గకు పూర్వం అఆలు కాకుండా ఇతర అచ్చులు ఉండి విసర్గ తరువాత ఏదైనా అచ్చు వస్తే విసర్గ స్థానంలో రేఫ వస్తుంది.

హరిః + ఇవ = హరిరివ

గురుః + ఏవ = గురురేవ

(మిగతా 17వ పేజీలో)




వ్యాకరణ పరిభాషలో య, ర, ల, వ అనే నాలుగు తెలుగు అక్షరాలు లఘువు, అలఘువు అని రెండు భేదాలతో ఉంటుంది. ఇది లిపిలో కాదు. పలకడంలో సూక్ష్మంగా ఉన్న భేదం. మనం మనకు తెలియకుండా అప్రయత్నంగా య, ర,ల,వ అనే అక్షరాలను కొన్నిచోట్ల ఒత్తి, కొన్నిచోట్ల తేల్చి పలుకుతాం. తేలికగా పలికేవి లఘువులు. కొంత ఒత్తి పలికేవి అలఘువులు.

సంజ్ఞ లో సూత్రం 18:

**యరలవలు లఘువులని యలఘువులని ద్వివిధంబులగు**

కాయ,మాయ వంటి పదాలలో శబ్దగతంగా ఉన్న య అలఘువు.

సంధి లేనప్పుడు రెండు అచ్చులకు నడుమ వచ్చే యడాగమం లఘువు.

హరి+అతడు అన్నప్పుడు హరియతడు అని అవుతుంది. ఇలాంటి చోట్ల ఆగమ యకారం లఘువు.

అలాగే చెఱకు మున్నగు పదాలలో ఉన్న శకటరేఫం అలఘువు. పెరుగు, కరువు మొదలగు పదాలలో ఉన్న ర లఘువు.

శకటరేఫం(ఱ) దేశ్య పదాలలో తప్ప తత్సమ,తద్భవాలలో ఉండదు.అని సూరిగారు వివరించారు.

బహువచనంలో ర,ల, డ లకు ఆదేశంగా వచ్చే ళ అలఘులకారం.

ఏరు+లు =ఏళులు

త్రాడు+లు=త్రాళులు

మొదలైన చోట్ల ర, డ,ల స్థానాలలో ఆదేశంగా వచ్చిన ళ అలఘువు.

శబ్దగతంగా కల,తల మొదలైన నుడులలో ఉన్న ల లఘువు.

అతడు + పలికె = అతడు వలికె మున్నగుచోట్ల పకార స్థానంలో ఆదేశంగా వచ్చిన వ కారం లఘువు.

వల మొదలగు నుడులలో శబ్దగతంగా ఉన్న వ కారం అలఘువు.

ఈ విధంగా సూరి గారు లఘ్వలఘు యరలవల వివరణ ఇచ్చారు.

ఇప్పుడు ఒక సందేహం కలుగుతుంది. వర్ణమాలలో ళళలి అనే ఒక అక్షరం కనబడుతున్నది. బహుత్వంలో ర, డ,ల స్థానంలో ఆదేశంగా వచ్చిన అలఘు ల ఏ వర్ణమాలలో ఉన్న ళ నా? అని సందేహం కలుగుతుంది.

అదే అయినట్లయితే అలఘువులుగా చెప్పబడిన య,ర,వ లకు కూడా ప్రత్యేక అక్షరాలు వర్ణమాలలో చూపాలి కదా! అనే శంక కలుగుతుంది.

అందువల్ల చిన్నయ సూరి గారు"వర్ణ సమామ్నాయమందలి ళ కారము వర్ణాంతరము గాని, యలఘు ల కారము గాదని యెరుంగునది" అని స్పష్టం చేసారు.

వర్ణమాలలో కనబడే ళ అనే అక్షరం ప్రత్యేక అక్షరమే. అది అలఘు ల కారం కాదు.

మరి ఇదెక్కడ వస్తుంది? అంటే...తాళము, గొళ్ళెము,పళ్ళెము మొదలగు నుడులలో కనిపించే ళ కారం... వర్ణమాలలో విడిగా కనిపించే ళ అని గ్రహించాలి. **(సశేషం)**

---

## లేఖ

**అ**వధానపుష్కరిణి అంతర్జాలమాసపత్రిక, **ఫిబ్రవరి-2026 సంచికలో "వ్యాకరణవరివస్య" శీర్షికలో** ప్రచురించిన ఒకటి, రెండువిషయాలను గురించి ప్రస్తావించదలిచాను. చిత్తగించగలరని సంపాదకులకు మనవి.

**1) "...ఈ సిద్ధ ఖండా(డ)బిందువులు (అరసున్న) ఎక్కడెక్కడ ఉంటాయో తెలపడానికి ప్రత్యేక విధివిధానాలు లేవు."** అని ఈ వ్యాసంలో ఉంది. సూరి సంజ్ఞాపరిచ్ఛేదంలో (14-16 సూత్రాలు) పదసిద్ధ, సాధ్య- పూర్ణ, అర్ధానుస్వారాల గురించి స్పష్టంగా పేర్కొన్నాడు. **"...పరుషసరళంబులకు ముందే బిందువు..";** "**దీర్ఘము మీద సాధ్యపూర్ణము లేదు**"; వంటి నియమాల్లోను, "**వర్గయుక్సరళములు పరములగునపు డొకానొకచో ద్రుతమునకుఁ బూర్ణబిందువు...**" సూత్రం ద్వారా **"వచ్చెంధాత్రీపతి", " పాడెంగంధర్వుఁడు"** ఇత్యాది లక్ష్యాలలోనూ బిందుస్వరూపం తెలుస్తోంది. ఈ సూత్రవివరణలు ఇదే వ్యాసంలో మధ్యలో కనిపించాయి కూడా. **"చిగురు + కయిదువు"** (చిగురుంగయిదువు / చిగురుఁగయిదువు) వంటి సమాసాలలో ద్రుతానికి లోపం నిత్యంగా ఉన్నా, **"విధానసామర్థం చేత"** అంటూ (సంధి 24-25 సూత్రాలలో) ద్రుతకార్యాల వల్ల బిందువులు చేరే విధానాలను సూరి పేర్కొన్నాడు. అందువల్ల- అచ్చతెనుఁగులో పరుషసరళాలకు ముందు బిందువు (సిద్ధ-సాధ్య,ఖండ-పూర్ణాలనే నాలుగు రకాలుగా) వస్తుందని స్పష్టం. ఉదాహరణకు **చీఁకటి, చెంబు, రేఁగు, చెందొవ** మొదలైన పదాలను గమనించండి. సంస్కృతంలోలాగా **(సంఘాతం, కంసారి)**, తెలుగులో

(మిగతా 17వ పేజీలో)

(15వ పేజీ తరువాయి)

## పద్యకవిత్వము - సాధుప్రయోగాలు

**3.2** విసర్గకు పూర్వం అఆలు కాకుండా ఇతర అచ్చులు ఉండి విసర్గ తరువాత గఘజ, జఝఞ, డఢణ, దధన, బభమ (వర్గ 3, 4, 5 అక్షరాలు) మరియు యరలవహ అక్షరాలు ఉన్నప్పుడు విసర్గ స్థానంలో రేఫ వస్తుంది.

బహిః + ద్వారము = బహిర్ద్వారము

గురుః + బ్రహ్మ = గురుర్ బ్రహ్మ

**4. విసర్గకు పూర్వం ఏ అచ్చు ఉన్నా విసర్గ తరువాత కఖ, చఛ, టఠ, తథ, పఫ, శ, ష, స అక్షరాలు ఉన్నప్పుడు ఏర్పడే సంధులు**

**4.1** విసర్గ తరువాత క, ఖ ఉన్నప్పుడు విసర్గ మారదు. లేదా విసర్గ స్థానంలో జిహ్వామూలీయం (ᳵ) వస్తుంది.

అంతః + కరణము = అంతః కరణము, అంత ᳵకరణము

మనః + ఖేదము = మనః ఖేదము, మన ᳵ ఖేదము

**4.2** విసర్గ తరువాత ప, ఫ ఉన్నప్పుడు విసర్గ మారదు. లేదా విసర్గ స్థానంలో ఉపధ్మానీయం (ᳵ) వస్తుంది.

అంతః + పురము = అంతః పురము, అంత ᳵపురము

తపః + ఫలము = తపః ఫలము, తప ᳵఫలము

**4.3** విసర్గ తరువాత చ, ఛ లు వస్తే విసర్గ శకారంగా మారుతుంది.

దుః + చర్య = దుశ్చర్య

అంతః + ఛేదన = అంతశ్ఛేదన

**4.4** విసర్గ తరువాత ట, ఠ లు వస్తే విసర్గ షకారంగా మారుతుంది.

ధనుః + ఠంకారము = ధనుష్ఠంకారము

**4.5** విసర్గ తరువాత త, థ లు వస్తే విసర్గ సకారంగా మారుతుంది.

మనః + తాపము = మనస్తాపము

**4.6** విసర్గ తరువాత శ కారం వస్తే విసర్గ మారదు. లేదా వికల్పంగా విసర్గ శకారంగా మారుతుంది.

నిః + శబ్దము నిః శబ్దము, నిశ్శబ్దము

**4.7** విసర్గ తరువాత ష కారం వస్తే విసర్గ మారదు. లేదా వికల్పంగా విసర్గ షకారంగా మారుతుంది. తెలుగు పద్య సాహిత్యంలో దీనికి అంతగా ఉదాహరణలు లేవు.

**4.8** విసర్గ తరువాత స కారం వస్తే విసర్గ మారదు. లేదా వికల్పంగా విసర్గ సకారంగా మారుతుంది.

మనః + సాక్షి = మనః సాక్షి, మనస్సాక్షి **(సశేషం)**

(16వ పేజీ తరువాయి) **వ్యాకరణ వరివస్య**

"స్థిరాలకు" (పరుషసరళాలు కానివి) ముందు బిందువుండదనీ తాత్పర్యం. అలాగే **అఁట, ఇఁక, చుఁడు** శబ్దాలలో తప్ప, పదంలో మొదటి హ్రస్వం తరువాత ఖండబిందువు మరెక్కడా రాదని స్పష్టంగా ఉంది. ఇవన్నీ తెలుగులో బిందుస్వరూపాన్ని చెప్పే సామాన్య, ప్రత్యేకవిధివిధానాలే.

**2) "సంస్కృత సమ ఇతరాలు అంటే తద్భవాలు. దేశ్యాలు, తద్భవాలకు కూడా అచ్చతెలుగు పదాలుగానే పరిగణన"** అని వ్యాసంలో ఉంది. **"సంస్కృతసమేతరం బయిన యీభాష యచ్చ యనంబడు.** (ఆచ్ఛిక-1)" అన్న చిన్నయసూరి అభిప్రాయం ప్రకారం, వ్యాసకర్త పేర్కొన్నట్లు తద్భవాలు, దేశ్యాలు మాత్రమే కాకుండా, అచ్చతెనుఁగు పదాల విభాగంలో "ప్రాకృతసమాలు" కూడా చేరుతాయి. తత్సమాలంటే సంస్కృతసమ, ప్రాకృత సమాలు రెండు కదా. కానీ సూత్రకారుడు, "తత్సమేతరాలు" అని కాని, "ప్రాకృతసమేతరాలు" అని కాని చెప్పలేదు. అందువల్ల, అచ్చతెనుఁగు పదవిభాగంలో **1) ప్రాకృతసమాలు** (అగ్గి, కారము, గారవము, జేడ, జేముఁడు, రాణి, సింగారము, సిరి వంటివి), 2) **సంస్కృతభవాలు** (ఆకసము, గోడ, చేందురుడు, తామర, మొగము, మెకము, వంకర, సూది వంటివి), **3) ప్రాకృతభవాలు** (అచ్చెర, అచ్చెరువు, పుడమి, పయనము, మచ్చరము, జన్నము, లచ్చి, వెన్నుఁడు వంటివి), **4) దేశ్యాలు** (ఊరు, పేరు, ముల్లు, ఇల్లు, కోట, పేట, దూడ, మేడ, కోఁత, లేఁత, తావి, మోవి) కూడా చేరుతాయని గమనించాలి. గ్రామ్యాలు చేర్చినా.. వాటి(ని)కి అన్నిచోట్లా ప్రయోగార్హత లేదు కాబట్టి గ్రామ్యాలను విడిచిపెట్టవచ్చు. అందువల్ల కేవలం తద్భవాలూ దేశ్యాలే "అచ్చతెనుఁగు" అంటే మరి ప్రాకృత సమాలేమయ్యాయి? అనే సందేహం వస్తుంది. అవి కలుపుకునే అచ్చతెనుఁగుగా పరిగణన.

3) **"యకారంబును, వువూవొవో.." అన్న సూత్రవివరణలో– ...'వోలె' అనే పదం ఒకటి దీనికి భిన్నంగా కనిపిస్తున్నది"** అని వ్యాసంలో ఉంది. **వోలె – పోలె** పదానికి గసడదవాదేశం. "వోలె" లోని వకారం సిద్ధవకారం కాదు. **వలె(న్)– వోలె(న్)** అయిందంటామా? వువూవొవోలు తెలుగులో మొదట లేవన్నది లక్షణంగా తీసుకుంటే, 'వోలె' అని ఉండడం లక్షణవిరుద్ధమై, గ్రామ్యం అవుతుంది. లోకంలో **"బ్రోచు"** అన్నపదం **"ప్రోచు"** మూలకమని, ద్రుతసంధివశాన "బ్రోచుగా" మారుతోందని శిష్టలోకవిదితమే. అదేవిధంగా "వోలె" శబ్దం కూడా "గసడదావాదేశ" ప్రభావజన్యమని ఊహించవచ్చు.

**– శతావధాని డా. రాంభట్ల పార్వతీశ్వరశర్మ,** 24.02.2026




# కావ్యదోషాలు

డా॥ సూరం శ్రీనివాసులు

ఇంతవరకూ పద దోషాలను చూచాం. ఈ పదదోషాలనే మరింతగా విశ్లేషించి, వాటి సంఖ్యను ఇంకా పెంచారు కొందరు ఆలంకారికులు. మమ్మటుడు కావ్యప్రకాశంలో పదదోషాలుగా పదహారింటిని చెపుతాడు.

1. శ్రుతికటువు 2. చ్యుతసంస్కృతి 3. అప్రయుక్తం 4. అసమర్థం 5. నిహతార్థం 6. అనుచితార్థం 7. నిరర్థకం 8. అవాచకం 9. అశ్లీలం(మూడు విధాలుగా) 10. సందిగ్ధం 11. అప్రతీతం 12. గ్రామ్యం 13. నేయార్థం 14. క్లిష్టం 15. అవిమృష్ట విధేయాంశం 16. విరుద్ధమతి కృత్తు.

వీటిలో కొన్ని వామనుడు చెప్పిన పదదోషాలే. మరికొన్ని మనం చెప్పుకోనబోయే పదార్థదోషాలు వామనుని మతంలో పదహేనవ దోషమైన అవిమృష్ట విధేయాంశం తప్పనిసరిగా గమనించదగినది. వాక్య నిర్మాణంలో అర్థప్రతిపాదన క్రమంలో ఉద్దిష్టం, విధేయం అని రెండు అంశాలు ఉన్నచోట దేని స్థానంలో అది ఉండాలి, దేని ప్రాధాన్యం దానికుండాలి. కాని చాలాచోట్ల అవి తారుమా రవుతాయి. లేదా విధేయం అప్రధానమై వివక్షనే దెబ్బతీస్తుంది. సమాస నిర్మాణంలోని అభిరుచి శ్రుతి మించినప్పుడు కూడా విధేయం అప్రధానమవుతుంది. మహాకవులుగా భావింపబడే వాళ్ళు, భావించుకొనేవాళ్ళు కూడా ఈ పొరపాటు చేస్తూనే వుంటారు, ఉన్నారు. అంటే గింజుకుంటారు. వాస్తవానికి క్షేమేంద్రుడు ఔచిత్యవిచారచర్చలో ఇలా వుండకూడదంటూ కాళిదాస శ్లోకాలనూ ఉదాహరించాడు. అంతమాత్రాన కాళిదాస పుస్తకాలను చదవడం మానేశామా? క్షేమేంద్రుడే మహాకవి అన్నామా? “అస్మిన్ అతివిచిత్రకవిపరంపరావాహిని సంసారే కాళిదాస ప్రభృతయః ద్విత్రాః పంచషా వా మహాకవయ ఇతి గణ్యంతే” అన్న ఆనందవర్ధనుని మాటనే గౌరవిస్తున్నాం గదా! అనౌచిత్యం అనిపిస్తే వ్రాసింది కాళిదాసు కాదు అన్నామే కానీ క్షేమేంద్రుణ్ణి నిందించలేదే! కాళిదాస కవిత్వాన్నీ కళ్ళకద్దు కుంటున్నాము, ఔచిత్య విచారచ్చరనూ శ్రద్ధగా చదువు కుంటున్నాము గదా! అవిమృష్ట విధేయాంశ స్వరూపం చూద్దాం –

వ్యర్థ పాండిత్య భూషితుండతఁడు గానఁ
గినిసి సభవీడి ద్రుతముగఁ జనియె నాఁడు

ఇది ప్రయోగం. ఇక్కడ సన్నివేశం – ఒకడు సభలో వాదించ బోయి, కుదరక, తన పాండిత్యం వ్యర్థమై, కోపంతో సభను వదిలి వేగంగా వెళ్ళిపోయాడు అనాడు – అని అర్థం – ఇక్కడ పాండిత్యం ఉద్దిష్టం (ఉద్దేశ్యం). వ్యర్థం కావటం విధేయం. ప్రాధాన్యం వ్యర్థం కావటానికే కాని వ్యర్థమయిన పాండిత్యంతో భూషితుడు కావటానికి కాదు. ఆ వ్యర్థం కావటం సమాసంలో ఎక్కడో పడిపోయి అప్రధానమయింది. అందుకని అవిమృష్ట విధేయాంశమనే దోషం. ఆ దోషం తొలగిపోవాలంటే చెప్పవలసిన రీతి ఇది –

తనకు పాండితి వ్యర్థమై మనగ లేక
కినిసి సభవీడి ద్రుతముగఁ జనియె నాఁడు

ఇక్కడ పాండితి ఉద్దిష్టమై, అది వ్యర్థం కావటం విధేయమైంది. రెండు వ్యస్త పదాలతో దీనిని గూర్చి ఏం చెప్తున్నామో స్పష్టమైంది. సభవీడి చనుటలోని కార్యకారణ భావమూ స్పష్టంగానే తెలుస్తుంది.

అది యమునాసుందరతీరమూ
అది రమణీయబృందావనమూ
అది విరిసిన పున్నమి వెన్నెల
అది వీచిన తిమ్మెర ఊయల
అది చల్లని సైకత వేదిక
అట సాగెను విరహిణి రాధిక...

ఇది ఒక అద్భుతమైన గీతం. అయితే ‘సుందర యమునా తీరమూ’ అని వాడటం వ్యాకరణ మర్యాద. అప్పుడే ఆ యమునా తీరంలో సౌందర్యం విధి కుదురుతుంది. కానీ పై ప్రయోగంలో యమునా సుందరుడి యొక్క తీరమూ అని అర్థం వచ్చి యమునా సుందరుడికీ తీరానికి వున్న స్వస్వామి భావ సంబంధం వ్యక్తమై ఆ యమునా సుందరుడెవరో వెతుక్కొనే పనిలో పడతాడు పాఠకుడు. కాకపోతే పాట కాబట్టి గాన సౌందర్యంలో సాహిత్యా సౌందర్యం లీనమైపోయింది.

“తన దేహోద్భవ తంతుసంతతులు” అని ఒక ప్రయోగం ఒక సాలెపురుగు యొక్క ప్రవృత్తిని వర్ణిస్తున్న పదబంధం. తన యొక్క దేహం నుంచీ పుట్టిన తంతువుల సంతతితో అని వాక్యార్థం. ఇక్కడ “యొక్కకు లోపంబు బహుళంబు” అనే ప్రౌఢ వ్యాకరణ సూత్రం మేరకు యొక్క (షష్ఠీ విభక్తి ప్రత్యయం) లోపిస్తుంది. యొక్క ప్రత్యయం. సమాసగతంగా అది లోపిస్తుంది. తన

పదానికి అవ్యవహితోత్తర పదం దేహం. తన యొక్క దేహం తన దేహం. ఇంతవరకు చక్కగా కుదురుతుంది. కానీ దేహపదం అటు వెళ్ళి దేహం నుండి పుట్టిన(ఉద్భవ) పదంతో అన్వయించాలి. తన... సంతతులు అని సామాసికాన్వయం. కానీ ఇక్కడ దేహంతోనే అది అన్వయించాలి తన పదం. తన దేహం అన్నంత వరకే అయితే యొక్క లోపించినా దేహ ప్రాధాన్యం నిలుస్తుంది. సమాసం కొనసాగించినందువల్ల దేహం అప్రధానమవుతోంది. విధేయాంశంలోని ప్రాధాన్యం సన్నగిల్లుతోంది. ఇటువంటి ప్రయోగాలు చాలానే ఉంటాయి. అన్ని చోట్లా అర్థమవుతూనే ఉంటాయి కానీ అవిమృష్టవిధేయాంశాలై. పై ప్రయోగంలో కవివివక్ష తన పదాన్ని తంతుసంతతులతో అన్వయించటమే అయి దేహం అప్రధానమైతే ఇక్కడ అవిమృష్ట విధేయాంశత లేనట్టే. అయితే అక్కడ ఆత్మీయమైన భావన కొరవడుతుంది. సమాసైక దేశాన్వయం వలన వచ్చే ఇబ్బంది. ఇది. 'తన దేహం నుండీ పుట్టిన' అన్న ప్రౌఢిమ దీపం అప్రధానమైతే కనిపించదు.

అవిమృష్టవిధేయాంశంతో పాటు విరుద్ధమతిని కలిగించే పదాల ప్రయోగమూ దుష్టమే. 'ముక్తి నొసంగుతన్ సదా' అన్న ప్రయోగంలో సదా పదం విరుద్ధమతిని కలిగిస్తుంది. ముక్తి ఒక్కసారే అవసరం, సాధ్యం. మరి సదా ఏమిటి? ఎల్లప్పుడూ ముక్తి లభించటంవా. అనుగ్రహించటవా ఏమిటి? సంస్కృతాంధ్ర భాషల్లో ఈ ముక్తిలో కాంతాత్వాన్ని ఆరోపించి మాటాడటం చాల సహజం. ప్రవరుడు కూడా వరూధినిని తిరస్కరిస్తూనే మోక్షాన్ని లక్ష్మితోనే పోలుస్తాడు.

ఈ పాండిత్యము నీకుఁ దక్క మఱియెందుఁ గంటిమే కామశా
స్త్రోపాధ్యాయివి నా వచించెదవు మేలోహో త్రయీ ధర్మముల్
పాపంబుల్ రతి పుణ్యమంచు నిఁక నేలా తర్కముల్ మోక్షల
క్ష్మీపథ్యాగమ సూత్రపంక్తి కివె పో మీ సంప్రదాయార్థముల్

(మనుచరిత్ర 2/64)

ప్రవరుడు మోక్షాన్ని లక్ష్మితో పోల్చటం కనిపిస్తోంది. మోక్షం/ముక్తి అన్నింటిని వదులుకొనే లక్షణం గలది. సంపదలు తగులు కొనే లక్షణం గలవి. ఆ రెండింటికీ పోలిక చెప్పటం సంస్కృతాంధ్ర కవులకే చెల్లింది. ముక్తికాంతాపరిష్వంగం దాకా వెళ్ళినవాళ్ళూ ఉన్నారు. ఇక్కడ ఈ ఆరోపణ మోక్ష-లక్ష్మి. లక్ష్మి స్థాయిని పెంచకపోగా మోక్షస్థాయిని తగ్గిస్తుంది. దాని గొప్పతనానికి విరుద్ధమైన భావాన్నిస్తుంది.

మనుచరిత్రలోనిదే మరో పద్యం.

తరుణి ననన్యకాంత నతి దారుణ పుష్పశిలీముఖవ్యథా
భరవివశాంగి నంగభవు బారికి నగ్గముసేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితో నని రోషభీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణి దాల్చెఁ గషాయ దీధితిన్

(తృతీయాశ్వాసము – 10)

ప్రవరుడు అగ్నిదేవుని అనుగ్రహంతో హిమవన్నగం నుండీ తన ఊరికి వెళ్ళిపోయిన తర్వాత జరిగిన సూర్యాస్తమయ వర్ణన. సూర్యుడు కషాయకాంతిని వహించటానికి కారణాన్ని కవి ఉత్ప్రేక్షిస్తున్నాడు. ఇది హేతూత్ప్రేక్ష. ఈ ఉత్ప్రేక్ష కవిది. సూర్యుడలా భావిస్తున్నాడేమో అంటూ కవియే ఉత్ప్రేక్షిస్తున్నాడు. తన భావాన్ని సూర్యుని మనస్సులోనికి / బుద్ధిలోనికి చొప్పిస్తున్నాడు. వివరం –

వరూధినిని మదనుని బారికి లోబరచి మహీసుర + **అధముడు, క్రూరుడై** వెళ్ళిపోయాడట. అంతరవకు పెద్దన ప్రవరుని భుజాలనెత్తుకొని, **'తలంచునే సతుల మాయల్ ధీరచిత్తంబులన్'** అని ప్రవరుని ధీరుడన్నాడు. ఇప్పుడు అందుకే క్రూరుడు అంటున్నాడు. అంతేకాదు అధముడు అని కూడా బిరుదపదాన్ని అందిస్తున్నాడు. క్రూరుఁడై అన్న ఒకే ఒక్కపదం అంతవరకు ద్వితీయాశ్వాసమంతటా పెద్దన ప్రస్తుతించిన ప్రవరుని గొప్పతనమంతా మట్టి కొట్టుకొని పోయింది. తద్విరుద్ధ భావాలకు ప్రోది చేస్తూ.

గౌతముడు బుద్ధుడై తిరిగి వచ్చి "సంసృతి(సంసారం) బంధకారణమనీ, ముక్తిని పొందడానికి వీలు కాక చెడిపోవట మెందుకనీ, సత్యభూత దయాశీల రూపమైప త్రిశబ్దమంత్ర" ముందని ప్రజలకు బోధ చేసే సందర్భం – బోధ లక్ష్యం బంధవిముక్తి.

పద్యాన్ని చూద్దాం –

యమనియమమ్ములాకులు, యదార్థము నాభి, సమాధి నేమియై
యమరిన ధర్మచక్రము దయామతిఁ దాలిచి త్రిప్పరయ్య! యా
యమునకు బొమ్మవెట్టియు భవాసురు నొదలమెట్టి మోక్షకాం
త మెదను తాలిగట్టుటకుఁ దారసిలున్ శుభాతంతు సంతతుల్

(సౌందరనందం – 23)

భవాసురుణ్ణి ప్రక్కనపెట్టి ముక్తిని పొందాలంటే మోక్ష కాంత మెడలో తాళి కట్టాలట! ఆంధ్రకవుల అలంకార ప్రియత్వం, మన ముక్తి మార్గానుసరణం ఇలా ముగుస్తుంది. మళ్ళీ ఆమె మెడలో తాళి కట్టటంతో. ఒక తాళిని ఎగతాళి చేస్తూ మరో కాంత మెడలో తాళిగట్టడం విరుద్ధమతికల్పనమే గదా! తాళిగట్టుట, మోక్షకాంత పదాలు ఇక్కడ లేకపోతేనే బాగుంటాయి. కానీ కవులు, పండితులు అధికభాగం ఆ బాటలో నడవటానికి ఉబలాటపడేవారే.

## సహృదయాః ప్రమాణమ్ – వినతి

లేఖ

సూరం శ్రీనివాసులు..మూలపేటసంస్కృతకళాశాలలో అవధానం ప్రారంభించినప్పటినుండీ పరిచయం.. సమకాలీనుడనై పరిచయమున్న నాకు తెలియజేయక, నా అభిప్రాయం తెలుసుకోక..నా అనుమతిలేక 'అవధానపుష్కరిణి' పత్రికలో నా పద్యాలలో వారుదోషాలనుకున్నవాటిని యథేచ్ఛగా ప్రకటిస్తున్నారు. గత ఫిబ్రవరి సంచికలో సూరం వారి దోషారోపణలు.. గమనికలను గమనిస్తే..

02. నీటి ఆవిరి

"... వడలును పానకమ్ము వడపప్పును కాచిన నీటి యావిరిన్ ఉడికిన వ్రీహిచూర్ణమున నొప్పగు వంటకమున్..."

– సాంప్రతి సురేంద్రనాథ్, 12-9-25

ఇక్కడ కాచిన పదం అనర్థకం. ఎందుకంటే ఆవిరి అనేది కాచిన నీటినుండి వచ్చేదే కానీ చల్లని నీటి నుండి వచ్చేది కాదు. కాబట్టి ఆవిరి పదంలోనే త్రాగటమన్న క్రియార్థం కూడా ఉంటుంది. దానితో గతార్థమైన ఈ 'కాచిన' పదం వాచ్యమై అనర్థకమవుతోంది. ఈ కవీశ్వరునిదే మరో ప్రయోగం – "ఆవిరి అనేది కాచిననీటినుండి వచ్చేదే కానీ చల్లని నీటి నుండి వచ్చేది కాదు"..ట

అవును కదా.. ఈ పండితుడు ఏదో చదువుకున్నాడు కానీ.. భౌతికశాస్త్రదర్శనం చేయలేదేమో...జలము..ఘనపదార్థమైనప్పుడు మంచుగడ్డ(Ice).. ద్రవపదార్థంగా ఉన్నప్పుడు నీరు(water).. ధూమాకారమైనప్పుడు ఆవిరి(gas) అని ప్రాథమిక పదార్థశాస్త్ర విజ్ఞానం ఉన్నవాడెవడైనా గ్రహించగలిగే ద్రవ్య తత్త్వం.. ఆ విధంగా చల్లని నీటికి కూడ 'ఆవిరి' ఉంటుందని.. @science student నైనా ఆశ్రయించి తెలుసుకోవచ్చు.. అలా చల్లని నీటినుంచి ఆవిరిని ఉత్పన్నం చేసేవే humidifiers అనీ.. cold steam అనీ.. ఇంకా.. ఇంకా.. ఆ వైజ్ఞానికవిషయాలు. అయినా ఈ గొడవంతా ఎందుకు.. **కాచిననీరు – వేడినీరు.. కాచిననీటి యావిరిన్ – వేడినీటి ఆవిరి..** వేడినీళ్లలో కాక, వేడినీటి ఆవిరిలో ఉడికించిన పదార్థము అనుకుంటే న చ శంకా నచోత్తరమ్..

అయితే అలా కవిహృదయం గుర్తించడానికి కావలసినది 'పాండిత్యం' కాదు.. 'సహృదయత'.. 'కావ్యసౌందర్య దర్శనాధ్యయన పరిపక్వత'.

'కేవలవైదికుల్ .. కేవల శాబ్దికసార్వభౌములున్..కేవల తార్కికుల్..మఱియు కేవలు లెందఱునైన కావ్యకృద్భావము నిర్ణయించి రసపాకమెఱింగి సుఖించ' లేరని.. పైగా మహాకవితావివేచనాభ్యాసమనంగ నంతఁ బయిపైఁ బడి యున్నదె? యద్దియున్ జనుర్వాసనయే సుఁడీ!... అన్నారు కదా.. తిరుపతివేంకటకవులు...

03. ముంగురులు

"ఈ కవీశ్వరునిదే మరో ప్రయోగం" – (కవీశ్వరునిదే అనడంలో వెటకారం...) అంటూ..

"రాసకేళీ పరిభ్రమణ విభ్రమ వేళ
చెదరిన ముంగురుల్ నుదుట నాడ" (20-11-25)

ఇది శ్రీకృష్ణ దర్శన సన్నివేశం. ముంగురులు నుదుట ఆడుతున్నాయని వర్ణన. నుదుట వ్రాలిన కురులనే ముంగురులు అంటారు. అలా కానివి కురులు మాత్రమే. నుదుట పదంతోనే అవి నుదుట వ్రాలటం గతార్థమైంది. కాబట్టి అక్కడ ముంగురులలో ముందు వరకు అనర్థకదోషజుష్టమైంది. అక్కడ కురులు అన్న ప్రయోగమే చాలు.

నిజమే..కాని వట్టి కురులు అంటే చాలదు..కురులనే ముంగురులుగ తీర్చాలి. అలా తీర్చిన రాయలవారి పద్యం..

**సకల సీమంతినీలోక సమతిశాయి**
**భాగ్యవర్ణావళులు వ్రాసెఁ బద్మగర్భుఁ**
**డనఁగఁ గర్పూరతిలకరజోవదాత**
**ఫాలమునఁ గుంతలశ్రేణి పడఁతి కమరు** (ఆముక్తమాల్యద)

గోదాదేవి ఫాలమున 'కుంతలశ్రేణి'– ముంగురులు ఆమె నుదుట బ్రహ్మదేవుడు వ్రాసిన మంగళాక్షరములవలె అమరినవి..

అలకా శ్చూర్ణకున్తలాః – చూర్ణాః కుటిలాః కున్తలాః చూర్ణకున్తలాః –ముంగురులు (అమరము). చూర్ణకున్తలములనే ముంగురులకు పర్యాయపదములుగ "కుంతలశ్రేణి' అన్నారు రాయలవారు..వట్టి కుంతలములు అనలేదు. కురులు ముంగురులు కావాలి అంటే 'చిరుకురులు' లేదా 'నెఱికురులు' లేదా 'కుంతలశ్రేణి' లేదా 'చూర్ణకున్తలాః' కావాలి. అయితే ముంగురులు కాని కురులు–శిరోజములు–కూడ ఫాలభాగంపై వ్రాలి సొగసులు తీర్చవచ్చు..

మ. మురళీనాదమరందబిందులహరీ ప్రమోదంబుచే లోచానాం
బురుహంబుల్ ముకుళింప నోష్ఠమణిసొంపుల్ మీఱ నాదర్శభా
సురగండస్థలి యొప్ప స్రస్తచికురస్తోమంబు ఫాలంబుపై
మురువుల్ నూపఁ జెలంగు కృష్ణవదనాం భోజంబు భావించెదన్
(శ్రీకృష్ణకర్ణామృతం)

స్రస్తచికురస్తోమంబు – జారిన కేశములు.. అంటే అవి నుదుటిపైకి జారిన శిరోజములే కాని రమణీయనర్తనవిలాసంతో

'నుదుటనాడే' ముంగురులు కావుగా.. "చెదరిన ముంగురుల్ నుదుట నాడ"

చెంతచేర నిదె చెలియ "నుదుటిపై"
చింతల చెదిరిన "చిరునెరులు"
కాంతకన్నులను గండుమీలకును
కంతుడు వేసిన గాలములే..           (అన్నమయ్య)

"రాసకేళీపరిభ్రమణవిభ్రమవేళ చెదరిన ముంగురుల్ నుదుట నాడ" అక్కడ జరుగుతున్నది ప్రకృతి పరవశించిన రాసక్రీడ.. ఆ పరిభ్రమణవిభ్రమంలో తీర్చిదిద్దుకున్న చిరుకురులు చెదరి "నుదుట నాడ" – 'ఆడ' ముఖ్యమైన పదం..'–నుదుటిపై నర్తిస్తున్నాయి.. చెదరిన ముంగురుల ఆ నర్తనమునకు రంగస్థలం ఏది.. "నుదురు" కాక.. 'కపోలములా–చెక్కిళ్ళా..?'

చెక్కిళ్ళే అంటాడు..ఈ "సూరం మహాకవీశ్వరుడు" తాను అనువదించిన 'మత్తవిలాసప్రహసనమ్' లో..

చిఱుచెమటల్ మొగంబున నిసీ! కనుదోయిన భ్రూవిలాసముల్
పరంగెను ఖేలనమ్ము, స్మితభావన మహేతువు, వ్యక్తి హీనముల్
గిరులును, గన్నులున్నెఱుపు గీల్కొలెం జంచలతన్ వహించె ముం
గురులు కపోలభారమునం గూడెదు వీడిన మాలికల్ వలెన్

(కపోలభారము – ముద్రారాక్షసమై ఉండాలి.. 'కపోలభాగమున' అనుకున్నప్పుడే సమన్వయిస్తుంది.. కాదు 'కపోలభారమే' అనుకుంటే..నాయిక బుగ్గలు జారిపోయిన 90 ఏండ్ల ముదివగ్గ అవుతుంది..)

ఆహాహా.. నుదుటిపై నర్తించే ఆ చిరుకురులను లాగి..ఈడ్చి.. బుగ్గలపైకీడ్చినప్పుడు.. పాపం.. ఈ బలవత్కర్షణవేదనకు ఆ అబల 'ముంగురులు' అవెంత రోదించాయో.. అదీకాక..ఇలా ముంగురులు కపోలభాగములో 'కూడెదు'.. కూటమి.. ఏ కూడుట స్వామీ ఇది.. గుమికూడుతున్నాయా... లేక..మరొకవిధంగా 'కూడెదు' ..?! 'మహాకవీశ్వరులకే'తెలియాలి..

అంతేనా.. ఆ విధంగా 'కపోలభాగమునంగూడెడు ముంగురులు' – 'వీడిన మాలికల్ వలెన్' – ఉన్నాయట.. అంటే ముంగురులలో పూలమాలికలు..ఇదెలా వీలు.. ఉంగరాలుతిరిగిన చిరుకురులలో మల్లపూరేకైనా ఇమిడించడానికి వీలుంటుందా... కానీ ఈ సూరంమహాకవీశ్వరుని అనువాదంలో వీడిన మాలికలే అయిపోయాయి..ఏమి సౌభాగ్యం. అయినా ఇది అనువాదం కదా అంటారేమో.. అయితే మూలంలో ఏముందో చిత్తగించండి..

అదీసంగతి.. ఔచిత్యమెఱిగిన మత్తవిలాసప్రహసన కర్త మహేంద్రవర్మకవిగారన్నమాట

"అంసోపాంతవిలమ్బినశ్చ విగలన్మాలాగుణా మూర్ధజాః"

'విడివడినపూలదండలవలె మూర్ధజాః–శిరోజములు–కేశములు భుజములపై ఉన్నాయి..'

మూలం ఇంత సార్థకంగా రమణీయంగా ఉన్నదే.. మరి ఆలంకారికదోషాల నామూలాగ్రం జీర్ణించుకున్న 'సూరంమహాకవీశ్వరుల' అనువాదం ఇలా 'దిగజారి' పోయిందే..

5. గురివిందతత్త్వమహత్త్వమ్

సరే..మంచిపనే.. చివర వీరిబోధ ఏమి..?

నిరర్థకాలైన సముచ్చయార్థకాలు, అవధారణార్థకాలూ, గతార్థాలూ, పునరుక్తులూ, బలహీనమైన విశేషణాలూ, పద్యాలలో దొర్లుతాయి. ఒకసారి దొర్లితే దాన్ని సవరించుకోవటం చాలా కష్టం. అది బాగుపడకపోగా మిగిలిన పద్యాన్నీ పాడుచేస్తుంది.

సముచ్చయాలూ.. గతార్థాలూ..గట్రా అయ్యాయిగా..

పునరుక్తులు..– దీనికి ఉదాహరణలు అన్వేషణలో దొరకలేదేమో..

పరవాలేదు.. ఈ మహాకవీశ్వరుని పద్యమేపునరుక్తులకు ఉదాహరించుకుందాం..

గిరిభూధర పాథోనిధి
పరమాద్భుత వస్తుగణముం బ్రచ్ఛన్నముగాం
బరంగంగం జేసెడు బుద్ధిని
సరి సుతుండవు నీవు దాచంజాలవె బొచ్చెన్ం
                    (మత్తవిలాసప్రహసనమ్–అనువాదం)

గిరి భూధర –గిరులూ భూధరాలూ..వేర్వేరా.. లేదా యౌగికార్థవ్యుత్పత్తిపాండిత్యాన్ని వెలికి తీయాలా..

ఇక సూరంగారి ఉపదేశం..

కవుల అజాగరూకతవల్ల గానీ, అతి జాగురూకత వల్ల కానీ ఇటువంటి ప్రయోగాలు కవిత్వంలో చోటు చేసుకుంటాయి. శారదాసమారాధన జీవితలక్ష్యమైనపుడు ప్రతిపదంలోనూ, సమతను కాపాడుకొంటూ ముందుకు సాగాలి.

ఏదో అదీ ఇదీగా..పైన దర్శించిన ఈ మహాకవీశ్వరుని పద్యాలలో..పదాలలో ప్రకాశిస్తున్నదోషసౌభాగ్యం 'అజాగరూకత' వల్లనా.. 'అతిజాగరూకతవల్లనా'.. తాము చెప్పదలచుకున్న దోషాలన్నీ తమరచనలలోనే నిక్షేపించుకున్న జాగరూకత కదా..ఆదోషాలకు లక్షణాలుగా ఇతరుల రచనల జోలికి పోక .. తమరచనలనే ఉదాహరించుకుంటే సరిపోలేదా.. లేదా తన నలుపెఱుగని గురివిందతత్త్వమహత్త్వమా..?!

**– సాంప్రతి సురేంద్రనాథ్**

# ఖండశర్కర

**నిర్వహణ: శతావధాని ఎం.వి. పట్వర్ధన్**
**అష్టావధాని చేపూరి శ్రీరామ్**

## ఈనెల అంశం: శివ శివా

### శిష్ట్లా వి ఎల్ ఎన్ శర్మ.

ఉ. నామది నీదె శంకర! వినమ్ర ప్రణామము జేయువాడ, వి
శ్రామ మెరుంగ వీ జగతి రక్షణజేయగ నాదిదేవ! నీ
నామము నుచ్చరించగనె నమ్మిన వారిని బ్రోచెదో! మహిన్
సోమకళాధరా! ప్రకటశోభల వర్ధిలుచున్! శివా! శివా!

ఉ. కాంతి విరాజమానమయి కాన్పడుచున్ భువినుండి మిన్నుకున్
భ్రాంతి తొలంగ జేసితివి భాసిలి జ్యోతి నిదర్శనమ్ముతో
ధ్వాంతము బాపి నిల్చితివి ప్రాణుల గావగ దేవదేవ భా
స్వంతపు లింగరూపమున స్థాణు ప్రశస్తుడవై శివా! శివా!

ఉ. రుద్రుడవై వహించెదవు లోకము రక్షణజేయు భారమున్
భద్రుడవై వినిర్మలత భాసిలు సౌమ్యమహత్త్వ శక్తితో
నిద్రితమైన చేతనను నెక్కొన జేయగ నీదుమంత్ర సా
రద్రుతమందు నాపదలు రావిక చెంతకిలన్ శివా! శివా!

ఉ. సాంబసదాశివా! విమల చారు విభూతి సుదేహభాస! యా
లంబన నీవె యీ జగతి లక్ష్యము నెంచుచు గాచువాడవే!
యంబరమంత నీ దయను నందగ దీనత మ్రొక్కుచుంటి మా
యంబ కృపావరంబులకు నాశ్రయ మీయుమయా! శివా! శివా!

ఉ. అంతయు నీవెనిండితి వనంతపు విశ్వమునంత బ్రోచుచున్
జింతలబాపి మానవుల క్షేమవికాసములం దధీక్షణన్
సంచిత పాపకర్మముల సంహృతి జేయుచు జన్మవృత్తమం
దంతమొనర్చుమయ్య కరు ణాప్తత దృక్కులతో శివా! శివా!

### విద్వాన్ బైరపనేని పోతురాజు చౌదరి.

తరళము..(.ధృవకోకిల)

శివ!శివా!యనిభక్తిచేమిము సేవజేయ ఫలింపదే
భవముబంధవిముక్తమైసుసభాస్థలంబులజేరగా
పవనగుంఫితకాయమియ్యదపాయమందుమరేయీ
కువలయాబ్జపు రోచులైకులుకున్?జరామరణంబుచే

తే.గీ. శివ!శివా !హిమ శైలమేస్థిరనివాస
మగుట భాగ్యమై నగనాథు కమరె ననుట
యుక్తమే కాక యున్నచో నోకసులకు
నెలవుగా నెట్లగును కీర్తి నిలచియాడ.

తరువోజ..

శివ!శివా! ఆనంద సిద్ధికై జనులు చేయరే జ్యోతలు సేమమే గోరి
భవహరమౌ శుభ పాదాబ్జములను భక్తిని వేడరే పావనమగుత
అవధరింపరెమీరు హ్లాదమ్ము తోడ నర్పించు గానాలనాదమరచుచు
భువనమోహనమైన మోముకాంతిధర పుణ్యఝరులనిచ్చు
ప్రోత్సాహ మగుత.

తే.గీ. శివ!శివా! నామ కీర్తనల్ సిద్ధ మంగ
ళమ్ము చేకూర్చు సంఘుమ్ము లగుత నెరుగ
రండుజనముభవాండమురహిని జెంద
శివశివానాట్య రవళులే శ్రీ కరమ్ము

మ. శివుడేసర్వశివాత్మకమ్ముగనగా చిత్తమ్ము సంప్రోక్షమౌ
స్తవరాజంబులబుద్ధినిల్పు నరుకున్ సామ్రాజ్య లక్ష్మీ ప్రదం
బవలీలన్ బడు మేధపూర్ణమగునార్యావర్తనంబందునన్
వ్యవహారమ్మునదక్షుడై వరలు నాహ్లాదంబుచేసాగుచున్
(శివ=శివుడు, శివా=పార్వతి)

### పెనుకొండ రామబ్రహ్మం బెంగుళూరు

ఉత్సాహము

శివశివాయటంచుఁ దనిసి చిత్తమునఁ నిలుపఁగ నా
భవుఁడు సుజన పాలకుండు భక్తవత్సలుండు భ
వ్య విలసత్ప్రభా ధృతినిఁ గపర్ది వరదుఁడు కరుణా
ప్రవరుఁడు భవతాపహారి రక్షనిడు భువిని సదా

ఉ పావన మొందిరయ్య నిను భక్తిని వీడక వేద మూఢులున్
దీవెన లెన్నొపొందిరిలఁ దిన్ననిఁ గాంచఁగ ద్యోతకమ్యెనే
భావన మీరఁగన్ శివ శివా యని కొల్చి తరించిరెందరో
నీవె సదాశివా శరణు నిత్యము ధాత్రినిఁ బ్రాణకోటికిన్

చం వరములఁ బొందిరే శివశివా యని మ్రొక్కఁగ దైత్యు లెందరో!
బవరము ముందుగా శివశివా యని పాండవులెల్ల వేడిరే!
వరలఁగ భక్తితో శివశివాయని ధన్యత నొంద నిక్కమౌ
పరమును గోరుచున్ శివశివా యని పల్కరొకో ముముక్షువుల్

తరలము (ధృవకోకిల)

శివశివా యన భారమంతయుఁ జేకితానుఁడు తాల్చడే
భవుఁడు రుద్రుఁడు భూతనాథుఁడు పాప నాశముఁ జేయడే
నవక మొందుచు నార్తితో నిజ నామ సంస్తుతిఁ జేయరే
శివశివా యని నెమ్మిఁ గాంచుచు చిత్తమందున నిల్పరే

తేటగీతి గర్భిత చంపకమాల

పడి భవ వేదనన్ శివశివా యన దీనులు చిత్రమౌనొకో!
వడిఁగొన రిక్తతన్ శివశివా యన నార్తినిఁ జిత్రమౌనొకో!
పడతుల నేఁచఁగన్ శివశివా యన క్షోభను చిత్రమౌనొకో!
వడకఁగ బాధలన్ శివాశివా యను పల్కులు చేరు జిహ్వపై!

**పి.ఎల్.నాగేశ్వరరావు, హైదరాబాదు**

ఉ. దారులు గానుపించవట! దట్టపు మావిడి వృక్షరాజముల్!
బారులుదీరి భక్తులటఁ బత్రిని గొల్వగఁ జిత్తశుద్ధితోఁ
గోరిన కోర్కెలెల్ల సమకూర్చుచు భక్తుల కెల్లవేళలన్
భైరవకోననుండు శివ పార్వతు లిర్వురుఁ గాచుచుండిరే !!

ఉ. మెచ్చిన రీతిలోఁ దిరుగు మేలగు పక్షులు, జంతుజాలముల్,
పచ్చనిలోయలోన బలు వానర జాతులు సంచరించినన్
బిచ్చుక, కాకులం గనము! ప్రేమగఁ బర్వెడు సర్పరాజముల్,
కచ్చియలేమి చూడమటఁ గావగ నిత్యము ద్వారపాలకుల్!!

ఉ. వేరుగ మూడుకొండలవి! విష్ణువు, బ్రహ్మయు, కంటివేల్పుగన్ !
బారగఁ జూడ దవ్వునను బర్వత మొక్కటె గోచరించునే !
తారలు, చంద్రునిన్ గనము తత్త్వ మదేమిటొ జూడమెచ్చటన్!
భూరిగఁ గొండలుండినను బొత్తిగ లేవటఁ గ్రూరజంతువుల్ !!

ఉ. శ్రీరమణీయమై గిరుల శీర్షపు టంచున సోనవానగా
బారుచు నన్నికాలముల, బాటల కధము పొంగిపొర్లుచున్
దూరపు పంటభూములకుఁ ద్రుళ్ళుచు సాగిన గంగసవ్వడుల్
చోరభయంబులేదచట! చోద్యమె చూడగనిట్టి భాగ్యముల్
( సోనవాన : అక్కడి జలపాతము పేరు )

ఉ. వందలవత్సరమ్ములగు పల్లవ రాజుల శిల్పసంపదల్
పొందుగ జెక్కినారచట భూరిగ నీశ్వరునాలయమ్ములన్
వందల శంభులింగములు వాసి గడింపగ క్షేత్రమందునన్
సుందర మందిరమ్మయి సుశోభిత రీతిని నిల్చెనచ్చటన్ !!

**అసనారె, హైదరాబద్**

చ: అవిరళ భక్తితో శివశివా! నిను నిత్యము తల్చుచుందు నే
కవనములన్ లిఖించుచు సుఖమ్మగు జీవనయాన మందగా
జవము నశించె కార్యముల, సాగగ లేను గృహమ్ము నుండి నా
యవయవములుల్ కృశించ, కన నాలయ మందు నొసంగు సత్త్వమున్

ఉ: భక్తుల కాతువే శివశివా! యని నిన్ను తలంచ నిష్ఠతో
శక్తినొసంగి గట్టునకు సాగగ, చేదుచు దర్శనార్థమై
ముక్తి ఘటిల్లు నీ భజనమున్ బ్రతుకీడ్చుచు నున్న, శూలి! యా
సక్తి నినున్ భజింతునిల సామిగ నెంచుచు నన్ను బ్రోచుమా!

ఉ: భస్మము దాల్చుచున్ శివ శివా! పితృ మందిరమందు నుందువే
విస్మయ మొందు చుందును నివేశన మున్ కని భూతధాత్రిపై
నీస్మరణన్ సతమ్ము మన నిర్మల చిత్తము తోడ కాతు వీ
వోస్మర వైరి! జీవనము నుత్తమ మార్గము జూపి బ్రోచుమా!

చ: వరదుడ వెంచగా శివ శివా! యని నిన్ను భజించ భక్తితో
సిరిగిరి చేరి, కల్గునిల శ్రేయ మవశ్యము, మల్లికర్జునా!
నిరతము నిన్ను గొల్చెదను, నీదయ నాకు ఘటిల్ల జేయుమా!
పరమశివా! హరా! పుడమి స్వస్థత నిచ్చి సతమ్ము కావుమా!

మ: శివరాత్రిన్ నిదురన్ త్యజించి ధృతితో సేవించినన్ నిష్ఠతో
స్తవనీయమ్మగు నీదు ప్రేమమున సంతాపమ్ము లంతమ్ములై
అవనిన్ సౌఖ్యము కల్గు నెల్లపుడు భవ్యాత్మా! శివానీప్రియా!
భవమున్ ద్రెంచి పరాత్పరా! కొనగ నే స్వర్గమ్ము దీవించుమా!

**ఆకుల శాంతిభూషణ్ , వనపర్తి**

శా. శ్రీకంఠున్ వృషభధ్వజున్ త్రిణయనున్ శీతాంశుచూడామణిన్
లోకేశున్ గజకృత్తివాసు నమరున్ రుద్రున్ లలాటాక్షునిన్
శ్రీకాళేశు భవున్ పినాకధరునిన్ శ్రీశైల లింగేశ్వరున్
శోకమ్ముల్ విదిలించు శ్రీకరుని నే స్తోమమ్ము జేతున్ మదిన్

చం. ఫణిధరు నాదిదేవు ఘన పర్వతరాజ సుపుత్రి వల్లభున్
ప్రణవపు రూపునిన్ భవుని పంచముఖున్ పరమేశ్వరున్ హరున్
గణపతి తండ్రినిన్ శివుని గర్వవినాశకునిన్ కపాలినిన్
మణినిభగాత్రు శూలధరు మాన్యుని భర్గుని భక్తి గొల్చెదన్!

మ. నగచాపన్ నతలోకపాలమణినిన్ నాగేంద్రహారున్ విభున్
జగదీశున్ సితభస్మదేహధరునిన్ శర్వున్ దయాశీలునిన్
మృగపాణిన్ త్రిపురాంతకున్ స్మరహరున్ మృత్యుంజయున్ శంకరున్
నిగమాంత ప్రతిపాద్యు నిర్మలుని మన్నింపంగ నే దల్చెదన్!

ఉ. పాలవిలోచనున్ గజవిభంగుని లింగని దక్ష శిక్షకున్
శీలనిధిన్ మహేశ్వరుని చిన్మయ రూపుని దేవ దేవునిన్
నీలగళున్ దిగంబరుని నిర్మల చిత్తుని వ్యోమకేశునిన్
శైలనివాసునిన్ ప్రభుని శంభుని పాలన సేయ వేడెదన్

తే.గీ. శివ!శివా! యని యనిశమ్ము శివుని గొలువ
హర! హరా! యని యాత్మను హరుని దలచ
భవ! భవా! యని భక్తిని భవుని బిలువ
భక్త సులభుండు ముదమంది ముక్తి నొసగు

**తదుపరి అంశం**

**విశ్వశ్రేయం కావ్యం**

పై అంశానికి 5 పద్యములను 9441039146
ఫోన్ నంబరుకు వాట్సప్ ద్వారా పంపగలరు
ఖండికలు పంపవలసిన ఆఖరు తేది
15 ఏప్రిల్ 2026

# సంస్కృతం సంస్కృతి 7

నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ

శబ్దాలతో వాటి విభక్తి రూపాలు నేర్చుకుంటాం అనుకున్నాం కదా. ఈ విభక్తి రూపాలతో పదాలను అమర్చుకుని వాక్యనిర్మాణం చేస్తాము. అయితే ఏ విభక్తి వాడాలి. తెలుగులోవలెనే ఇక్కడ సమానవిభక్తి వాడవచ్చునా? తేడా ఏమైనా ఉన్నాదా అని చూద్దాం.

శబ్దము అర్థం అని రెండు మాటలు విన్నాము కదా. అర్థము మనసులో కలిగే భావము. ఇది మనము చేసే క్రియతో ఎలాంటి సంబంధం ఉన్నదో తెలిపేది. ఆ భావానికి అనుగుణమైన శబ్ద రూపము విభక్తి అని స్థూలముగా చెప్పవచ్చు. క్రియతో ఎలాంటి సంబంధము కలిగి ఉంటుందో చెప్పేదానికి కారకం అని పేరు. అవి ఆరు రకాలు. కర్తృ కారకము, కర్మ కారకము, కరణ కారకము, సంప్రదాన కారకము, అపాదాన కారకము, అధికరణ కారకము అని. ఉదాహరణకి 'రామః శివాయ హస్తేన స్యూతాత్ గృహే ఫలం దదాతి' అనుకోండి. 'రాముడు శివునికి,చేతితో సంచిలోనుండి, ఇంట్లో పండును ఇచ్చాడు' అని తెలుగు అర్థం. ఇక్కడ 'దదాతి' క్రియ. ఎవరు చేస్తున్నారు అంటే ఇవ్వాలా వద్దా అన్న స్వాతంత్ర్యం కలవాడు, ఇవ్వడము అన్న పనిలో ప్రధానమైన వాడు అయినటువంటి రాముడు. కనుక రాముడు కర్త. అదే కర్తృకారకము. ఏమి ఇచ్చాడు అంటే 'ఫలం'. ఇది కర్మకారకము. ఏ సాధనముతో ఇచ్చాడు? 'చేతితో'. ఎవరికి ఇచ్చాడు – శివునికి. ఎక్కడనుంచి ఇచ్చాడు – 'సంచినుండి'. ఎక్కడ ఇచ్చాడు – ఇంట్లో. ఇలా ప్రతి పదము ఇచ్చుట అన్న 'దదాతి' క్రియతో సంబంధము కలిగిఉన్నది.

మనసులో కలిగే అర్థమునకు కారకము అన్నాము. అది వాక్యములో వ్రాసేటప్పుడు లేదా మాట్లాడేటప్పుడు ఏ విభక్తి వాడాలో తెలియాలి కదా. సాధారణముగా కర్మకారకానికి ద్వితీయా విభక్తి వస్తుంది. అలాగే కర్తృ, కరణ కారకాలకి తృతీయా విభక్తి, సంప్రదాన కారకానికి చతుర్థీ విభక్తి, అపాదాన కారకానికి పంచమీ విభక్తి అధికరణ కారకానికి సప్తమీ విభక్తి వస్తాయి అని తెలుసుకోవాలి. అయితే ఇక్కడ అతి ముఖ్యమైన విషయం గమనించాలి. కొన్ని సందర్భాలలో పైన చెప్పినట్లు ఆయా కారకాలకి ఆయా విభక్తులు రాకపోవడం గమనిస్తాం. అంటే కారకానికి విభక్తి నిర్ణయం చేసేటప్పుడు చిన్న పరీక్ష చేసుకుంటామన్న మాట.

క్రియ దేనిని సూచిస్తున్నదో గుర్తించాలి. మన ఉదాహరణలో దదాతి అన్నది క్రియాపదం. దదాతి అంటే ఇస్తున్నాడు అని. ఎవరిస్తున్నారు అంటే రాముడిస్తున్నాడు అని సమాధానం. అంటే దదాతి అన్న క్రియాపదం రాముడు అనే కర్తని సూచిస్తున్నది. పైన చెప్పినట్లు రాముడు కర్త కనుక తృతీయావిభక్తి రావాలి. కానీ క్రియాపదం కర్తను సూచిస్తున్నది కనుక అలా సూచించబడ్డప్పుడు మాత్రం ప్రథమావిభక్తి వస్తుంది. ఒక ఉదాహరణ చూస్తే బాగా అర్థమౌతుంది. '1. శివుడు హరిని పూజిస్తున్నాడు' అన్నా, '2. హరి శివునిచేత పూజింపబడుతున్నాడు' అన్నా ఒకటే అర్థం కదా. మరి ఒకచోట హరి అని, ఇంకో చోట హరిని అని ఎందుకంటున్నాం? ఏమోనండీ అలా వచ్చేస్తుంది అంతే అన్నది సమాధానం.

దానికి కారణం ఇప్పుడు తెలుసుకుందాం. పై తెలుగువాక్యాలనే సంస్కృతములో చెప్తే '1. శివః హరిం భజతి' అని, '2. హరిః శివేన భజ్యతే' అంటాం. భజ ధాతువుకి పూజించుట, సేవించుట అని అర్థాలు. రెండు వాక్యాలలో కూడా పూజించేవాడు శివుడు కనుక కర్తృకారకం. పూజింపబడేవాడు హరి కనుక కర్మకారకం. పూజించుట అన్న క్రియతో వాక్యము వ్రాసినప్పుడు రెండు రకాలుగా వ్రాసాము. వాటికి కర్తరి ప్రయోగము, కర్మణి ప్రయోగము అంటారు. తెలుగు, సంస్కృతములలో కూడా. మొదటి వాక్యములో పూజిస్తున్నాడు అన్నప్పుడు పూజించుట అన్న క్రియ శివ శబ్దాన్ని సూచిస్తున్నది. కనుక శివ అనే కర్తృవాచక శబ్దము క్రియతో చెప్పబడినది అందాం. రెండవ వాక్యములో పూజింపబడుతున్నాడు అన్నప్పుడు పూజింపబడుట అన్న క్రియ హరి అన్న కర్మవాచక శబ్దమును సూచిస్తున్నది. కనుక హరి అన్న కర్మవాచక శబ్దము చెప్పబడినది కదా. అంటే పై రెండు వాక్యాలలో కూడా క్రియతో ఏ కారకము చెప్పబడిందో ఆ కారకమునకు రావలసిన విభక్తి స్థానములో ప్రథమా విభక్తి వచ్చింది అన్నది స్పష్టము కదా.

అయితే కొన్ని చోట్ల అలా కనబడదు. ఉదాహరణకి 'రాముని నమస్కరిస్తున్నాను' అన్న తెలుగు వాక్యము సంస్కృతములో 'రామం నమామి' అని 'రామాయ నమః' అని రెండు రకాలుగా అంటారు కదా. మరి కర్మకారకమైన రామ శబ్దము ద్వితీయావిభక్తిలో కాక చతుర్థీవిభక్తిలో ఎందుకు వచ్చింది అంటే సంస్కృతములో కొన్ని ప్రత్యేక పదములతో కలిసినప్పుడు ఫలానా విభక్తి రావాలి అనే నియమ సూత్రాలు ఉన్నాయి కనుక. ఇలాంటి ప్రత్యేకపదముల కలయిక ని ఉపపద విభక్తులు అంటారు.

తెలుగులో, సంస్కృతములో కూడా మొదటి వాక్యములో కర్తృకారకపదము ప్రథమా విభక్తిలో ఉన్నది, రెండవ వాక్యములో కర్మకారకము ప్రథమా విభక్తిలో ఉన్నది. అంటే తెలుగు సంస్కృతాలలో విభక్తి ప్రయోగములో సర్వసాధారణముగా తేడా లేదు. ఉపపద విభక్తులు తెలుసుకుంటే సరిపోతుంది. తెలియలేదన్నా ఇబ్బంది లేదు ఎందుకంటే మనకి కారకవిభక్తి తెలిసినది కనుక అది హాయిగా వినియోగించవచ్చు. నిజానికి ఉపపద విభక్తి కన్నా కారక విభక్తి బలమైనది. కనుక సంస్కృతం నేర్చుకోవడం తెలుగు తెలిసినవారికి సులభమే.




2026 మార్చి 14న సిద్ధిపేట మిట్టపల్లిలోని శ్రీలలితా చంద్రమౌళీశ్వర క్షేత్రంలో జరిగిన
త్రిభాషా సహస్రావధాని **వద్దిపర్తి పద్మాకర్** గారి
ఏకదివస అష్టావింశతి (28వ) శతావధానం



శ్రీ గోదా సాహిత్య సేవా సమితి అధ్వర్యవంలో 'అవివిప' అధ్యక్షులు మరుమాముల దత్తాత్రేయ శర్మ
సంచాలకత్వంలో కాప్రాలోని శ్రీమతి హట్టి భానుమతి గారి స్వగృహంలో జరిగిన
విద్వాన్ **బైరపనేని పోతురాజు చౌదరి** గారి
తొలి అష్టావధానం

# అవధాన విద్యా వికాస పరిషత్

భాగ్యనగరం

## ప్రకటన

దైవదత్తమైన ప్రతిభకు వ్యుత్పన్నత తోడైతే, లభించిన పాండిత్యాన్ని నిరంతర అభ్యాసంతో పదునుపెడుతుంటే శిలలాంటి వాడైనా శిల్పంగా మారవచ్చు.

**సాధనాత్ సాధ్యతే సర్వమ్**

అనే లక్ష్యంతోనే అవధాన విద్యా వికాస పరిషత్ ఆవిర్భవించింది.

తెలుగుభాషకే స్వంతమైన అవధానవిద్యను భావితరాలకు పదిలంగా అందించాలనే సదుద్దేశంతో గత నాలుగు సంవత్సరాలుగా మేము చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తుడడం అందరెఱిగిందే. అదే ఒరవడిలో **2026 మే నెల 18వ తేదీనుండి 24 వతేదీ వరకు** ఐదవ శిక్షణ శిబిరాన్ని భాగ్యనగరంలో నిర్వహించ దలచాము.

**వేదిక:** సెయింట్ మార్క్స్ హైస్కూల్, దీనదయాల్ నగర్, నేరేడుమెట్టు, మల్కాజిగిరి, హైదరాబాద్

ఔత్సాహికులు సంసిద్ధులు కండి. మీ సంసిద్ధతను 9441039146 లేదా 9441491900 లేదా 8555082034 నెంబర్లకు తెలియజేయండి.

**Published by**
Avadhana Vidya Vikasa Parishat
Sri Rama Sadanam, 29-1499/6/1, Road No.1
West Kakatiya Nagar, Neredmet, Secunderabad - 500056
Ph: 9441039146